
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
శుక్రవారం 9 మే 2025

ఆగని గ్రావెల్ దందా!



అల్లూరు మండలంలో గ్రావెల్‌ను తీసుకెళ్లుతున్న టిప్పర్

కావలి : ప్రభుత్వాలు మారినా కావలి నియోజకవర్గంలో గ్రావెల్ దందా మాత్రం ఆగడం లేదు. గత వైసీపీ హయాంలో గ్రావెల్ వ్యాపారం రూ.కోట్లలో జరిగింది. అప్పట్లో అధికారులు పూర్తిగా చేతులెత్తేయడంతో వైసీపీ నేతలకు ఆదాయ వనరుగా మారింది. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రావెల్ అక్రమ రవాణాకు కొంత కళ్లెంపడింది. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో గ్రావెల్ వ్యాపారంతో రూ.కోట్లు గడించగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం కట్టడి చేయడాన్ని ద్వితీయశ్రేణి నేతలు వ్యతిరేకించడం, నేతలపై ఒత్తిడి తేవడంతో గ్రావెల్ తవ్వకునేందుకు కొందరికి అవకాశం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో కావలి నియోజకవర్గంలో అక్కడక్కడా కొంత మేర గ్రావెల్ అక్రమ వ్యాపారం ప్రారంభమైంది. అయితే కావలి ప్రాంతంలో ఎక్కడా పెద్దగా లేఅవుట్లు వేయక పోవడంతో చెరువులలో నీరు ఉన్నందున గ్రావెల్ అందుబాటులో లేదు. దీంతో కావలి మండలంలో రుద్రకోట రైల్వే ట్రాక్‌కు పడమర పొలాల్లో, కొత్తపల్లి, ఆర్సీ పాలెం పొలాల్లో ఎర్రమట్టిని రోడ్లకు, ఇళ్ల నిర్మాణాలకు తోలుతున్నారు. ఇందులో గ్రావెల్ లభించినప్పుడు దానిని రాజుపాలెం, నెల్లూరు ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ప్రచారం.

● బోగోలు మండలం కప్పురాళతిప్ప దిగువ ప్రాంతంలో అల్లిమడుగు సంఘం వద్ద, తాళ్లూరు తిప్ప నుంచి గ్రావెల్‌ను రాజుపాలెం, నెల్లూరులకు తరలిస్తున్నారు. ఇటీవల పోలీస్‌ల దాడులతో తవ్వకాలు ఆగిపోయాయి. అల్లూరు మండలం నార్తుఆములూరు, బత్రకాగొల్లు గ్రామాల్లో పొలాల నుంచి గ్రావెల్ అక్రమంగా తవ్వుతున్నారు. డిమాండ్‌ను బట్టి టిప్పర్ 6వేల వరకు అమ్ముతున్నారు.



తవ్వేసి.. మింగేసి!

ఎన్డీఏ ప్రభుత్వంలోనూ మాఫియా దోపిడీ ● రేయింబవళ్లు తవ్వకాలు.. తరుగుతున్న ప్రకృతి సంపద ● అక్రమార్కులకు రాజకీయ, అధికారుల అండ

మన్ను మింగుతున్నా.. మిన్నకుండిపోతున్నారేం?



ఉదయగిరి ప్రాంతంలో గ్రావెల్‌ను ట్రాక్టర్‌లో నింపుతున్న ఎక్స్‌కవేటర్

గ్రావెల్, మట్టి ప్రకృతి అందించిన సహజ సంపదలు ఇవి. ఈ విలువైన సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. కానీ కొందరు అక్రమార్కులు ఈ సంపదను దోచేస్తున్నారు. అక్రమార్కులు, రాజకీయ నాయకులు, కొంతమంది అధికారులు మాఫియాగా ఏర్పడి సంపదను కరగబెట్టేస్తున్నారు. వైసీపీ హయాంలో హద్దులు పెట్టి మరీ కొల్లగొట్టిన మాఫియా ప్రభుత్వం మారినా 'తగ్గేదేలా..' అంటూ పేట్రేగిపోతున్నారు. ప్రభుత్వ భూములు, వాగులు, దొంకలతోపాటు చెరువులపై వాలిన మాఫియా గద్దలు రేయింబవళ్లు తవ్వేసి తరలిస్తున్నారు. ట్రక్కుకు ఇంత అని ఎవరికి వారుగా వాటాలు వేసుకుని పంచుకుంటున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలపై 'ఆంధ్రజ్యోతి' బృందం చేసిన పరిశీలనలో నిగ్గుతేల్చే నిజాలు వెలుగులోకి వచ్చాయి.

ఉదయగిరి : నియోజకవర్గంలోని జలదంకి, కొండాపురం, కలిగిరి, వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో యథేచ్ఛగా అక్రమంగా మట్టి తరలింపు సాగుతోంది. ఇటీవల వింజమూరు మండలం నల్లగొండ్లలో ఎలాంటి అనుమతుల్లేకుండా రహదారి నిర్మాణానికి నెలల తరబడి గ్రావెల్ తరలిస్తుండగా గ్రామస్థులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన గ్రావెల్ తవ్వే ప్రాంతానికి చేరుకుని వాహనాలు సీజ్ చేయించారు. ఇలా ప్రతి మండలంలో లేఅవుట్లకు, ఇటుకబట్టీలకు, రహదారుల నిర్మాణానికి మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

● **అరకొర అనుమతులతో..**

ఉదయగిరి నియోజకవర్గంలో 167-బీజీ, 166-బీ, గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారుల నిర్మాణం కొంతకాలంగా జరుగుతోంది. ఈ రహదారుల నిర్మాణానికి కాంట్రాక్టరు అరకొరగా అనుమతులు పొంది ఇష్టారీతిన తవ్వకాలు చేస్తున్నారు. ప్రభుత్వ అటవీ భూముల్లో సైతం గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. అటవీ భూముల్లో తవ్వకాలు చేపట్టడంతో అధికారులు దాడులు చేసి రూ.లక్షల్లో మామూళ్లు తీసుకొని, రూ.వేలల్లో జరినామా విధించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే కొందరు లేఅవుట్, ఇటుకబట్టీల యజమానులు ఇరిగేషన్ శాఖకు అనుమతుల కోసం గోరంత చెల్లించి చెరువంతా దోచేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ ఉద్యోగుల కళ్ల ముందే గ్రావెల్ తరలిపోతున్నా చోద్యం చూస్తుంటారు. మట్టి తరలింపులో ఆయా శాఖల అధికారులకు ముడుపులు ముందుగానే ముట్టజెప్పి అనంతరం తమ పని తాము కానిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● సర్వేపల్లి నియోజకవర్గంలోనూ మాఫియా పేట్రేగిపోతోంది. వెంకటాచలం, పొదలకూరు, మనుబోలు మండలాల్లో గ్రావెల్‌ను తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : వైసీపీ పాలనలో నెల్లూరు బ్యారేజీ అభివృద్ధి ముసుగులో చేపట్టిన అక్రమ గ్రావెల్ తవ్వకాల పాపానికి బుచ్చిలోని కనిగిరి రిజర్వాయర్ కరకట్టలు, చారిత్రక 180 ఎకరాల పెనుబల్లి, జొన్నవాడ తిప్ప, 13 ఎకరాలకుపైగా మినగల్లు పాలతిప్పలో గ్రావెల్, తెల్లరాళ్లు కొల్లగొట్టారు. ఈ తవ్వకాలతో ఎప్పుడు వరదలొచ్చినా కనిగిరి రిజర్వాయర్ కరకట్టలకు ముప్పు తప్పదని ఆయకట్టు రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినా రాత్రిపూట గ్రావెల్ దోపిడీ జరుగుతూనే ఉంది.

కందుకూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : మట్టే బంగారం అన్న నానుడి నిజమైంది. గ్రావెల్‌కు విపరీతమైన డిమాండ్ నెలకొనడంతో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. రియల్ ఎస్టేట్ వెంచర్లు, గృహ నిర్మాణాలు, ఇటుకబట్టీలు, చిన్నతరహా పరిశ్రమలు, తీర ప్రాంతంలో హేచరీలు, ఇతరత్రా ఏ నిర్మాణం జరగాలన్నా రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు గ్రావెల్ (మట్టి) అవసరం ఎంతో ఉండటంతో మట్టి మాఫియా రెండు చేతులా సంపాదిస్తోంది. ప్రైవేటు భూములను కొనుగోలు చేసి మట్టి తరలించుకోవాలంటే ఎంతో వ్యయంతో కూడిన వ్యవహారం కావడంతో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు, వాగులు, డొంకలు, దేవదాయ శాఖ భూములలో ఇష్టారీతిగా తవ్వకాలు జరిపి రెండుచేతులా సంపాదిస్తున్నారు. మట్టి మాఫియాకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మామూళ్ల కోసం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుండటం, కొందరు రాజకీయ అండదండలతో వ్యవహారం చక్కబెట్టుకుంటుండటంతో మట్టి అక్రమ తరలింపు వ్యవహారం ప్రహసనంగా మారింది. పత్రికల్లో వార్తలు రావడమో, స్థానికులు ఫిర్యాదు చేయటమో జరిగితే రెండు రోజులు హడావిడి ఆ తర్వాత యథావిధి అన్న చందంగా మాఫియాకు సహకరిస్తున్నారు.



ఉలవపాడు : వరిగచేను సంఘం వద్ద ఓ వెంచర్‌కు రాజుపాలెం చెరువులోని గ్రావెల్‌ను తోలి చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

● **కందుకూరులో విచ్చలవిడిగా..**

కందుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో రామాయపట్నం పోర్టు, ఇతర పరిశ్రమల పేరుతో పెద్దఎత్తున రియల్‌ఎస్టేట్ వెంచర్లు ఏర్పాటవుతున్నాయి. ఈ వెంచర్లకు ఆ మండలాల పరిధిలోని రావూరు, తెట్టు, వీరేపల్లి, రాజుపాలెం, కరేడు తదితర చెరువుల నుంచి గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నారు. కందుకూరు చుట్టుపక్కల లేఅవుట్లు, జరిగే వివిధ నిర్మాణ పనుల కోసం గ్రావెల్ ట్రక్కు రూ.2వేలు పలుకుతుండటంతో వెంకటాద్రిపాలెం, దూబగుంటలలో భూములను కొనుగోలు చేసి కొందరు గ్రావెల్ వ్యాపారం చేస్తున్నారు. మట్టి తరలించే ప్రాంతాలలో ఉన్న సంప్రదాయ బండ్లబాటలను కూడా వదలకుండా మట్టి తవ్వేస్తుండటం, వ్యవసాయ భూములకు నష్టం జరిగేలా 20 అడుగుల లోతుకు తవ్వుతుండటంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

● వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం, పోలినేనిచెరువు తదితర చెరువుల నుంచి ఇటుకబట్టీల కోసం అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల్లోనూ రియల్ వెంచర్లు, నిర్మాణ పనుల కోసం చెరువుల్లో మట్టిని తరలించేస్తున్నారు.



బుచ్చిరెడ్డిపాళెం : కనిగిరి రిజర్వాయర్ పరిసరాల్లో దుస్థితి

ఆత్మకూరులోనూ యథేచ్ఛగా..

ఆత్మకూరు : నియోజకవర్గ వ్యాప్తంగా గ్రావెల్ అక్రమంగా తరలిపోతోంది. అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంతో పట్టా, ప్రభుత్వ భూములనే తేడా లేకుండా గ్రావెల్‌ను తవ్వి అమ్మేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష నాయకులు ఎవరికివారుగా తెరవెనుక ఉండి ఈ వ్యవహారం నడుపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆత్మకూరు మండలం బీ.చిరువెళ్ల, నారంపేట, నెల్లూరుపాళెం తదితర ప్రాంతాల్లో అక్రమంగా గ్రావెల్ తరలివెళుతోంది. అలాగే ఏఎస్ పేట మండలం కొండ మీదకొండూరు గ్రావెల్ తవ్వకాలకు అడ్డాగా మారింది. సర్వే నెంబర్లు 130, 131, 132లలో పట్టాపొలాలతోపాటు ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇందులో చాలావరకు కొండలు, గుట్టలు ఉండడంతో వీటిపై మాఫియా కన్ను పడింది. రెండు వారాల క్రితం రాత్రి సమయంలో ఎక్స్‌కవేటర్లతో తవ్వి గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలించుకుపోయారు. ఆత్మకూరు, సంగం, బుచ్చి మండలాల్లో ఉన్న వెంచర్లకు గ్రావెల్‌ను తరలించి, ట్రాక్టరు మట్టిని రూ.1000 నుంచి 2వేల వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఏఎస్‌పేట పంచాయతీలోని గండువారిపల్లి చెరువు, అనుమసముద్రం, హసనాపురం చెరువులతోపాటు పలు గ్రామాల్లోని చెరువులు, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. అనుమసముద్రం, పెద్దబ్బీపురం, కొండమీదకొండూరు తదితర గ్రామాల్లో కొందరు నాయకులు అతి తెలివిగా పట్టా పొలాలను లీజుకు తీసుకుని మరీ గ్రావెల్‌ను తరలిస్తున్నారు. చేజర్ల మండలంలోని మాముడూరు తిప్ప తదితర ప్రాంతాల నుంచి కూడా గ్రావెల్ తరలుతోంది.





అనంతసాగరం : గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన భారీ గోతులు

కలెక్టర్‌కు రెడ్‌క్రాస్ పురస్కారం

నెల్లూరు (వైద్యం) : నెల్లూరు జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ విశిష్ట సేవలు అందించినందుకుగాను కలెక్టర్ ఆనంద్‌కు గవర్నర్ అబ్దుల్ నజీర్ పురస్కారాన్ని అందచేశారు. గురువారం రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర రాజధాని అమరావతిలో గవర్నర్ ఈ పురస్కారాన్ని కలెక్టర్‌కు అందచేశారు. జిల్లాలో రెడ్‌క్రాస్ ద్వారా మరిన్ని సేవలు అందించాలని గవర్నర్ ఆకాక్షించారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ ఆనంద్

రీసోర్స్‌పర్సన్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), మే 8 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యాసంవత్సరం (2025-26) రీసోర్స్ పర్సన్‌లుగా పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన ఎస్‌జీటీ, ఎస్‌ఏ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో బాలాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహించే విద్యా, ఉపాధ్యాయ శిక్షణకు హాజరై రీసోర్స్‌పర్సన్‌లుగా సేవలందించేవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు ఏఎంవో నెల్లూరు-2819 జీమెయిల్‌కు లేదా 94417 00940 నెంబర్‌కు వాట్సప్ ద్వారా దరఖాస్తులు పంపాలని తెలిపారు.

పెంచలో.. గోవిందో!

అత్తారింటి నుంచి ఆలయానికి చేరుకున్న శ్రీవారు

వధూవరులకు గిరిజనుల సంప్రదాయ సారె

కోనలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

వేడుకగా అంకురార్పణ.. నేడు ధ్వజారోహణం

6





గోనెపల్లి నుంచి కోనకు ఊరేగింపుగా బయలుదేరిన ఉత్సవర్లు

వింజమూరు కార్యదర్శి తొలగింపు

కోవూరు/వింజమూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): వింజమూరు పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను విధుల నుంచి తొలగిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ వీఆర్.కృష్ణతేజ మైలవరపు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కోవూరు పంచాయతీ నిధుల్లో రూ.1.17 కోట్ల మేరకు అవకతవకలు, అలాగే మండల పరిషత్ నిధుల్ని దుర్వినియోగం చేసినట్లు నిర్ధారణకు కావడంతో శాఖ పరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. గ్రేడ్- 1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ఆయన నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని జిల్లా పంచాయతీ అధికారి అందచేసిన మూడు రిపోర్టుల్లో తేలిందన్నారు. శివకుమార్‌ను తక్షణమే సస్పెండు చేస్తున్నట్లు ఆదేశించారు. తమ అనుమతి లేకుండా వింజమూరును వదలి వెళ్లకూడదని పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.



హంస వాహనంపై వేదగిరీశుడి వైభోగం

నెల్లూరురూరల్ (ఆంధ్రజ్యోతి) : వేదగిరి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేతంగా స్వామివారికి చప్పర ఉత్సవం జరిగింది. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ఉత్సర్లను పల్లకీపై కొలువుదీర్చి గిరిప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీవారిని ముస్తాబు చేసిన అర్చకులు హంసవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో గోపి, ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ విజేత వీఎస్‌యూ

ముగిసిన పురుషుల టోర్నమెంట్



వీఎస్‌యూ జట్టుకి ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వర్సిటీ వీసీ శ్రీనివాసరావు

వెంకటాచలం, మే 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ అఖిల భారత అంతర యూనివర్సిటీల పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) జట్టు నిలిచింది. దేశవ్యాప్తంగా పలు యూనివర్సిటీల నుంచి 97 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. 5 రోజులపాటు జరిగిన ఈ టోర్నీలో చివరిరోజు గురువారం నెల్లూరులోని వీఎస్‌యూ, మహారాష్ట్రలోని సంత్‌గాడ్గే బాబా అమరావతి యూనివర్సిటీ, కేరళలోని కాలికట్ యూనివర్సిటీ, రాజస్థాన్‌లోని మహారాజా సూరజ్‌మాల్ బ్రిజ్ యూనివర్సిటీలు తలపడ్డాయి. ఈ నాలుగు జట్ల మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరాహోరీగా మ్యాచ్‌లు జరిగాయి. అత్యుత్తమ ప్రతిభ చూపిన వీఎస్‌యూ జట్టు టోర్నమెంట్ విజేతగా నిలిచింది. ఇక ద్వితీయ స్థానంలో జైపూర్ వర్సిటీ, తృతీయస్థానంలో కాలికట్ వర్సిటీ, 4వ స్థానంలో మహారాష్ట్ర వర్సిటీ నిలిచింది. అనంతరం జరిగిన ముగింపు వేడుకలో విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. సర్వేపల్లి, కోవూరు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొని విజేతలను అభినందించారు. 4 జట్లకు ఎమ్మెల్యే సోమిరెడ్డి తన సొంత నిధులతో రూ.లక్ష రుపాయలు అందజేశారు. అలాగే వీఎస్‌యూ ప్రధాన ఆర్చీ నిర్మాణానికి వీపీఆర్ ఫౌండేషన్ తరఫున రూ.15 లక్షల విరాళాన్ని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రకటించారు.

పెంచలో.. గోవిందో!

* కోనలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు
* అత్తారింటి నుంచి ఆలయానికి చేరుకున్న శ్రీవారు
* నవ వధూవరులకు గిరిజనుల సంప్రదాయ సారె

రాపూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : గోనుపల్లి గిరిజనవాడలు గోవింద పెంచల నామస్మరణలతో మారుమోగాయి. తప్పెట్లు, తాళాలు, బాజాభజంత్రీల నడుమ ఉభయ దేవేరులతో కలిసి పెంచల నృసింహుడు బ్రహ్మోత్సవాలు చేసుకునేందుకు గురువారం అత్తారింటి నుంచి కోనకు పయనమయ్యారు. తొలుత గ్రామంలోని పెంచల ఆలయం నుంచి పల్లకిలో చెంచులక్ష్మీ అమ్మవారి ఇంటికి (గిరిజనవాడ) స్వామివారు చేరుకున్నారు. కొత్త అల్లుడి రాకతో గిరిజనవాడలో సంబరాలు అంబరాన్నంటాయి. ఇంటికి వచ్చిన అల్లుడికి గిరిజనులు తమ ఆచారం ప్రకారం పుట్టతేనె, ఇంజేటి గడ్డలు, నారె మొలతాడును సారెగా ఇచ్చారు. ప్రతి ఇంటి వద్ద ప్రత్యేక పందిళ్లు, ముగ్గులు వేసి వధూవరులకు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ముత్తైదువులు వధూవరులను గ్రామ పొలిమేర వరకు సాగనంపారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో దేవేరులతో కలిసి కొలువుదీరిన స్వామివారు గ్రామ శివారులోని గొల్లబోయి ఆలయానికి చేరుకుని తొలిదర్శనం గొల్లబోయికి ఇచ్చారు. అనంతరం బోయలు పల్లకి మోసుకుంటూ 6 కి.మీ కాలినడకన కోనకు పయనమయ్యారు. సహజ సిద్ధమైన చల్లని వాతావరణంలో కొద్ది దూరం, ట్యాంకర్లతో పట్టిన నీటితో చల్లబడ్డ రోడ్డుపై మిగిలిన దూరం వందలాది మంది భక్తులతో కలిసి శ్రీవారు కోనకు చేరారు. ఆలయ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. ఇక్కడ ఆరు రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించుకుని తిరిగి స్వామివారు గోనుపల్లికి చేరుకుంటారు. ఈ సందర్భంగా వారంపాటు గోనుపల్లివాసులు నియమనిష్ఠలతో మాంసాహారాలకు దూరంగా ఉంటారు. కాగా, కోనలో ఉత్సవమూర్తులకు ప్రత్యే క స్నపన తిరుమంజనం, విశేష పూజలు జరిగాయి.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

కోనలోని లక్ష్మీ నృసింహస్వామి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి, ఆంజనేయస్వామి వార్లను గురువారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ జేపీ సుధ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఘనస్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మండపంలో వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.



● ఉత్సవాలకు అంకురార్పణ

పెంచలకోనలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఆలయంలోని అలంకార మండపంలో అర్చకులు, టీటీడీ వేదపండితులు ప్రత్యేక యాగశాలలను ఏర్పాటు చేసి నిత్య హోమాలు చేశారు. అర్చకులు పుట్టమన్ను తీసుకొచ్చి అందులో నవధాన్యాలు కలిపి కలశస్థాపన చేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. ఎలాంటి ఆటంకాలు జరగకుండా దిగ్విజయంగా ఉత్సవాలు జరిగేందుకు ఈ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం కోన వీధుల్లో సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో శుక్రవా రం ఉదయం స్వామివారికి తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం, సాయంత్రం శేష వాహనం జరగనుంది.



శ్రీవారికి గిరిజనులు సమర్పించిన సంప్రదాయ సారె



ఆలయంలో అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు

నేటి నుంచి కోనకు ప్రత్యేక బస్సులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి) : పెంచలకోన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆర్టీసీ అధికారులు శుక్రవారం నుంచి ఈనెల 12 వరకు ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ముఖ్యంగా ఈనెల 11, 12 తేదీల్లో అన్ని డిపోల నుంచి ఎక్కువగా బస్సులు నడుపుతారు. ఈ బ్రహ్మోత్సవాలకు మొత్తం 60 ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

మానవత్వంతో సేవలు

* రెడ్‌క్రాస్ దినోత్సవంలో కోశాధికారి సురేష్‌కుమార్

నెల్లూరు (వైద్యం), మే 8 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్ మానవతా దృక్పథంతో ప్రజలకు సేవలు అందిస్తోందని సంస్థ పాలక మండలి కోశాధికారి సురేష్‌కుమార్ జైన్ వెల్లడించారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని గురువారం నెల్లూరులోని రెడ్‌క్రాస్ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో సురేష్ కుమార్ మాట్లాడుతూ పలు విభాగాల ద్వారా రెడ్‌క్రాస్ విస్తృత సేవలు అందిస్తోందని చెప్పారు. కేన్సర్ ఆసుపత్రిలో రోగుల సహాయకులకు భోజనం అందిస్తూ, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని పెద్దఎత్తున మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం పలువురు దాతలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, కోటారెడ్డి, గురునాథరావు, డాక్టర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

తపాలా సేవలు ప్రజలకు చేరువ చేయాలి

* విజయవాడ డివిజన్ పోస్టుమాస్టర్ జనరల్ మూర్తి

నెల్లూరు (హరనాథపురం) మే 8 (ఆంధ్రజ్యోతి) : తపాలా సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని విజయవాడ డివిజన్ పోస్టుమాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి సిబ్బందిని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో నెల్లూరు పోస్టల్ డివిజన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. నెల్లూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కే శ్రీనివాస్ మాట్లాడుతూ 2025- 26లో జిల్లాలో పోస్టల్ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న మూర్తి

వసతిగృహంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (హరనాథపురం) మే 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పొదలకూరురోడ్డులో ఉన్న విభిన్న ప్రతిభావంతుల (బాలికలు) వసతిగృహంలో చేరేందుకు ఆసక్తిఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రతిభావంతులశాఖ ఏడీ మహమ్మద్ ఆయూబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి మూడో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకోవడానికి ఆసక్తి ఉన్న బాలికలు ప్రవేశం పొందవచ్చన్నారు. శారీరక వైకల్యం, పాక్షిక అంధత్వం, దృష్టిలోపం ఉన్న బాలికలు ప్రభుత్వ వైద్యశాల నుంచి ధ్రువీకరణ పత్రం పొంది చేరవచ్చన్నారు. వివరాలకు 96184 04383 నెంబరును సంప్రదించాలని తెలిపరు.

● డీఎస్సీ కోచింగ్‌కు..

విభిన్న ప్రతిభావంతులు ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయూబ్ తెలిపారు. 40 శాతం వైకల్యం కలిగినవారు ఈనెల 11లోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విజయవాడలో శిక్షణ ఉంటుందన్నారు. టెట్ మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు.



రాడార్ కేంద్రంలో పూర్తయిన భవన నిర్మాణాలు

పుంజుకున్న రాడార్ వేగం

* కలెక్టర్ చొరవతో కదలిక
* మౌలిక వసతుల కల్పనకు త్వరితగతిన చర్యలు

విమాన సర్వీసుల దిశ, దశను నిర్దేశించే రాడార్ కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు అధికార యంత్రాంగం కదిలింది. ఇప్పటివరకు చెన్నై వింగ్ కమాండర్ పర్యవేక్షణలో పనులు జరిగేవి. అయితే పనులు జాప్యం అవుతున్న నేపథ్యంలో కలెక్టర్ ఆనంద్ చొరవ తీసుకున్నారు. ఫలితంగా మండల అధికారులు యుద్ధప్రాతిపదికన పనుల పూర్తికి చర్యలు చేపట్టారు.

- పొదలకూరు(ఆంధ్రజ్యోతి)

పొదలకూరు మండలంలోని మరుపూరు గ్రామ సమీపంలో 2010లో రాడార్ కేంద్రానికి 63 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ ప్రాంతంలో సిగ్నల్స్ బాగా అందుతున్నట్లు అప్పట్లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ అధికారులు గుర్తించి, భూములు కేటాయించాల్సిందిగా రెవెన్యూ అధికారులను కోరారు. ఇక్కడ రాడార్ కేంద్రం నెలకొల్పితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు స్థానికంగా పెద్ద టౌన్‌షిప్ ఏర్పడుతుందని జిల్లా అధికారులు భావించి భూములను సేకరించారు. భారత వైమానిక దళ అధికారులు రాడార్ కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రకటించినా, ఆ తర్వాత చాలాకాలంపాటు పనుల్లో జాప్యం నెలకొంది. అయితే, గడిచిన రెండేళ్లగా పనుల్లో వేగం పెరిగింది. వైమానిక దళానికి కేటాయించిన భూముల చుట్టూ ప్రహరీ, లోపల భవనాలు, సెక్యూరిటీ గదులను నిర్మించారు. ఇందు కోసం తొలి విడతగా రూ.9కోట్ల వరకు ఖర్చుచేశారు. కాగా ఇటీవల తహసీల్దారు బీ శివకృష్ణయ్య ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులు రాడార్ కేంద్రం వద్దకు చేరుకుని వివిధ అంశాలపై చర్చించారు. కాగా, ఈ కేంద్రానికి నీటిసౌకర్యం కల్పించేందుకు అధికారులు సమాలోచనలు చేశారు. సమీపంలో ఉన్న కండలేరు ఎడమగట్టు కాలువ ద్వారా నీటిని సరఫరా చేయాలనే ఆలోచన చేశారు. అయితే, ఈ కాలువకు నిరంతరం నీటి విడుదల చేసే పరిస్థితి లేదు. దీంతో మరుపూరు చెరువు నుంచి నీటిని సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ఇక చాటగొట్ల విద్యుత్ ఉపకేంద్రం నుంచి కరెంటు సరఫరాపై పరిశీలన జరిపారు. ఇంటర్నెట్ సదుపాయమూ కల్పించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రాడార్ కేంద్రానికి రోడ్డు నిర్మించేందుకు ఆ ప్రాంతాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించారు.

● ఉపయోగాలు ఇలా..

● **సైనిక రంగం :** విమానాలు, రాకెట్లు, క్షిపణులు, ఇతర సైనిక వస్తువులను గుర్తించడానికి, ట్రాక్ చేయడానికి రాడార్‌లను ఉపయోగిస్తారు. ఇది శత్రువుల కదలికలపై నిఘా ఉంచడానికి, రక్షణ ఏర్పాట్లకు సహాయపడుతుంది.

● **వైమానిక రంగం :** విమానాలు గుర్తించడం, ట్రాక్ చేయడం, వాతావరణ పరిస్థితులను అంచనా వేయడం వంటి పనులు కోసం రాడార్‌లను వినియోగిస్తారు. ఇది సురక్షిత విమానయానానికి సహాయపడుంది.

● **వాతావరణ విభాగం :** తుఫాన్లు, వర్షాలు, ఇతర వాతావరణ పరిస్థితులను గుర్తించడానికి, అంచనా వేయడానికి రాడార్లను ఉపయోగిస్తారు. ఇది వాతావరణ హెచ్చరికలను అందించడానికి, ప్రజల ప్రాణాలను కాపాడడానికి ఉపయోగపడుతుంది.

● **సముద్ర రవాణా :** నౌకలు, ఇతర వస్తువులను గుర్తించడానికి, ట్రాక్ చేయడానికి రాడార్‌లను ఉపయోగిస్తారు. ఇది సముద్రంలో సురక్షిత ప్రయాణానికి సహాయపడుతుంది.

● **ట్రాఫిక్ పర్యవేక్షణ :** ట్రాఫిక్ నియంత్రణలో రాడార్‌లను ఉపయోగించి వాహనాల వేగాన్ని కొలవడం, ట్రాఫిక్ కదలికను పర్యవేక్షించడం జరుగుతుంది.

● **ఇతర ఉపయోగాలు :** రాడార్‌లను అటవీ ప్రాంతాల మ్యాపింగ్, పురావస్తు శాస్త్రం, సివిల్ ఇంజనీరింగ్, మైనింగ్ వంటి రంగాలలో కూడా ఉపయోగిస్తారు.

ప్రజాసేవల్లో జవాబుదారీతనం ఉండాలి : జేసీ

నెల్లూరు (హరనాథపురం), మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రెవెన్యూ సేవలు అందించేందుకు జవాబుదారీతనం ఉండాలని జేసీ కే కార్తీక్ అధికారులను ఆదేశించారు. గురువారం తిక్కనభవన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రీసర్వేను ఎటువంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా పూర్తి చేయాలని కోరారు. రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. నోషనల్ ఖాతాలను సాధారణ ఖాతాలుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల నుంచి నీటితీరువా పన్నును వసూలు చేయాలని, పన్ను చెల్లించకపోతే ఆయకట్టు కొలతల్లో తేడాలు వచ్చే అవకాశం ఉందని రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఉదయభాస్కర్ రావు, ఆర్డీవో అనూష, సర్వే ఏడీ నాగేశ్వర్ పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో టెన్త్ మార్కుల జాబితాలు

నెల్లూరు(విద్య,ఆంధ్రజ్యోతి) : పదోతరగతి మార్కుల జాబితాలు విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల లాగిన్ నుంచి వాటిని డౌన్‌లోడ్ చేసుకుని, సంతకం చేసి విద్యార్థులకు అందచేయాలన్నారు. మార్కుల జాబితాల్లో లోపాలుంటే ఆధారాలతో ప్రభుత్వ పరీక్షల విభాగానికి ఈనెల 25లోగా పంపించాలని కోరారు.

ఉత్తమ పాఠశాలగా పెదపవని గురుకులం

* ఉత్తమ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ, విద్యార్థిని అవార్డులు సొంతం
* అందజేసిన మంత్రి బాలవీరాంజనేయస్వామి

లింగసముద్రం, మే 8 (ఆంధ్రజ్యోతి) : టెన్త్, ఇంటర్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పెదపవనిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసింది. అలాగే ఉత్తమ ప్రిన్సిపాల్, ఉత్తమ ఉపాధ్యాయ, ఉత్తమ విద్యార్థిని అవార్డులకు కూడా ఎంపిక చేసింది. విజయవాడలోని శ్రీతుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయులు, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రసన్న వెంకటేశన్‌లు ఉత్తమ పాఠశాల, ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును ప్రిన్సిపాల్ స్నేహలతకు అందజేశారు. అలాగే ఈ పాఠశాలకే చెందిన ఉపాధ్యాయులు ప్రవీణ (గణితం), దుర్గాభవానీలకు (సోషియల్) ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, 10వ తరగతిలో 593 మార్కులు సాధించిన కవితకు ఉత్తమ విద్యార్థి అవార్డు, రూ.20 వేల నగదు అందజేశారు.



మంత్రిడోలా వీరాంజనేయస్వామి నుంచి అవార్డు అందుకుంటున్న స్నేహలత

కారుణ్య నియామకాల ఉత్తర్వులు అందజేత

నెల్లూరు (జడ్పీ), మే 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జడ్పీ కార్యాలయంలో గురువారం జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో విద్యారమ, డిప్యూటీ సీఈవో మోహన్‌రావులు కారుణ్య నియామకాల కింద ముగ్గురికి ఉత్తర్వులను అందజేశారు. వెంకట రమణను మండల ప్రజాపరిషత్ బాలాయపల్లి, దాస్‌ను మండల ప్రజాపరిషత్ తడ, వెంకటసాయి చరణ్‌తేజను మండల ప్రజాపరిషత్ తోటపల్లిగూడూరుకు ఆఫీస్ సబార్డినేట్లగా నియమిస్తూ ఉత్తర్వులను అందచేశారు. అనంతరం ఆనం అరుణమ్మ మాట్లాడుతూ తాను చైర్‌పర్సన్ అయిన తర్వాత నుంచి ఇప్పటివరకు జడ్పీ పరిధిలో 76 కారుణ్య నియామకాలు, 107 పదోన్నతులు కల్పించామన్నారు. ఇప్పటివరకు ఖాళీ ఉన్న పోస్టులను త్వరితగతిన భర్తీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కే. భీమిరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్య దర్శి షేక్ మాబాషా జిల్లా పరిషత్ కార్యా లయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉత్తర్వులు అందుకున్న వారితో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో విద్యారమ తదితరులు

ఈ నెల్లోనే 'అన్నదాత సుఖీభవ'

* మార్గదర్శకాల విడుదల
* 3.71లక్షల మందికి వర్తింపు
* జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

నెల్లూరు(వ్యవసాయం), మే 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కార్యాచరణ చేపట్టింది. ప్రతి రైతు కుటుంబానికి రూ.20వేలు పెట్టుబడి సాయం కింద అందించేందుకు చర్యలు తీసుకుంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. దాదాపుగా ఈనెలాఖరులో పథకానికి అర్హులైన రైతుల ఖాతాల్లో నగదు జమయ్యే అవకాశం ఉంది. అర్హుల జాబితాను జిల్లా వ్యవసాయ, రెవెన్యూ అధికారులు దాదాపుగా సిద్ధం చేశారు. అయినప్పటికీ మరోసారి పోర్టల్‌లో రైతులు పరిశీలించుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి. లేదంటే పథకానికి అనర్హులవుతారు. దీనికి సంబంధించి జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి పలు విషయాలను 'ఆంధ్రజ్యోతి' ద్వారా రైతులకు తెలియజేశారు. మార్గదర్శకాల్లో కౌలు రైతులకు సంబంధించి ఎలాంటి ప్రస్తావన రాలేదన్నారు. త్వరలో కౌలు రైతులకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 'అన్నదాత సుఖీభవ' పొందడానికి ఈకేవైసీ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బంది ఈ-పంటతోపాటు ఈకేవైసీ ప్రక్రియ దాదాపుగా పూర్తిచేశారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులతో కలిపి జిల్లాలో దాదాపుగా 3.71లక్షల మంది రైతులకు ఈ పథకం అందే అవకాశం ఉందని సత్యవాణి తెలిపారు. ఈ జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఒక రైతు కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం అందించే రూ.6వేలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.14వేలు కలిపి రూ.20వేలు సాగు ఖర్చులకు జమ చేస్తారని వివరించారు. దీనికి సంబంధించిన మొత్తం జాబితా ఈనెల 20వ తేదీ వరకు అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో అందుబాటులో ఉంటుందని, పూర్తి వివరాలకు వారిని సంప్రదించాలని సూచించారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో జాబితా పరిశీలన జరుగుతుందన్నారు. ఆ తరువాత ఆర్‌టీజీఎస్ పోర్టల్‌లో జాబితా రీవాల్యుయేట్ అవుతుందని, తుది జాబితా తిరిగి రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారని చెప్పారు. ఎవరైనా అర్హులు తప్పిపోతే తిరిగి ఫేషియల్ ఈకేవైసీ ద్వారా నమోదు చేస్తారని స్పష్టం చేశారు. వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ సాగు భూమి ఉన్న ప్రతి రైతు ఈ పథకానికి అర్హులని తెలిపారు.



● వీరు అనర్హులు

ఒక సంస్థకు సంబంధించిన భూములు సాగు చేసుకునేవారు, రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఉద్యోగులు, పదవీ విరమణ ఉద్యోగులు(రూ.10వేలకు పైన పింఛను తీసుకునేవారు), ఆదాయపన్ను చెల్లించేవారు, రిజిస్టర్ చేసుకుని ప్రాక్టీసు చేస్తున్న వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, చార్టెడ్ అకౌంటెంట్లు, నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ (రెవెన్యూ రికార్డుల్లో అప్డేట్ అయినా, కాకపోయినా) 'అన్నదాత సుఖీభవ' పథకానికి అనర్హులు. అదేవిధంగా సరుగుడు, జామాయిల్, ఎర్రచందనం సాగు చేస్తున్న పొలాల రైతులు కూడా అనర్హులు.

అనుమానం పెనుభూతమై!

* భార్యను గొంతుకోసి హతమార్చిన కిరాతక భర్త
* వెంకటాచలం మండలంలో దారుణం
* పోలీసుల అదుపులో నిందితుడు

వెంకటాచలం, మే 8 (ఆంధ్రజ్యోతి) : కడవరకు తోడుంటానని పెళ్లిపీటలపై ప్రమాణం చేసిన కట్టుకున్న భర్తే ఆ ఇల్లాలిపాలిట యముడిగా మారాడు. భార్యపై అనుమానం పెంచుకుని అతికిరాతకంగా కత్తితో గొంతుకోసి దారుణంగా కడతేర్చాడు. వెంకటాచలం మండలం అబ్బిసాహెబ్ కండ్రిగలో బుధవారం అర్ధరాత్రి ఈ దారునం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..

పొదలకూరు మండలం వావిటిపర్తి గ్రామానికి చెందిన పచ్చిపాల బాబుకు వెంకటాచలం మండలం కందలపాడుకు చెందిన భారతికి (38) 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరూ కుమార్తెలు కాగా ఒకరు ఇంటర, మరొకరు 9వ తరగతి చదువుతున్నారు. అయితే కొన్నేళ్ల నుంచి బాబు తన భార్యపై అనుమానం పెంచుకుని తరచూ గొడవ పడుతుండగా కుటుంబ పెద్దలు సర్దిచెప్పేవారు. వేసవి సెలవులు కావడంతో భారతి తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని 10 రోజుల క్రితం వెంకటాచలం మండలం చవటపాళెం పంచాయతీ అబ్బిసాహెబ్ కండ్రిగ గ్రామంలో ఉన్న తన అక్క మందల కృష్ణవేణి ఇంటికి వచ్చింది. 3 రోజుల క్రితం బాబు కూడా అబ్బిసాహెబ్ కండ్రిగకు వచ్చాడు. ఈ క్రమంలో అనుమానం పెనుభూతంగా మారి బుధవారం అర్ధరాత్రి భారతి ఇంటి మిద్దెపై నిద్రిస్తుండగా బాబు గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాటలు పెరగడంతో పథకం ప్రకారం తన పక్కనే పెట్టుకున్న మచ్చు కత్తితో భార్య గొంతుకోసేశాడు. రక్తపుమడుగులో పడి భారతి కేకలు వేయడంతో ఆమె అక్క కృష్ణవేణి, భారతి కుమార్తెలు పెద్దగా కేకలు వేస్తూ వచ్చారు. తీవ్ర రక్తస్రావమై భారతి అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనాస్థలి నుంచి బాబు పరారవుతుండగా కుటుంబ సభ్యులు గమనించి పట్టుకున్నారు. సమాచారం అందుకున్న సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ ఆంజనేయులు హుటాహుటిన వచ్చి హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి కుమార్తె దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



భారతి (ఫైల్)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 500

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9347
వెండి కిలో ధర	రూ. 98.100
వెండి ఒక గ్రాము	రూ.101.10

11న ఆల్ ఇండియా ఓపెన్ చెస్ పోటీలు

కావలి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ చెస్ అసోసియేషన్, ఆర్‌ఎల్‌ఎస్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆల్‌ఇండియా ఓపెన్‌చెస్ పోటీలు ఈ నెల 11వ తేదీ ట్రంకురోడ్డులోని ఫెంటాస్టిక్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆర్‌ఎల్‌ఎస్ చెస్ అకాడమీ డైరెక్టర్లు రామ,లక్ష్మణ్ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదుగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విజేతలకు రూ.52వేలతో పాటు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

రేపు లక్ష్మీనృసింహ జయంతి

కావలి రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురం పెంకులఫ్యాక్టరీ సంగంలోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి జయంతిని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు బుర్రా శేషు స్వామి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం హోమాలు, అభిషేకాలు నిర్వహించటంతో పాటు మధ్యాహ్నం అన్న సంతర్పణ చేస్తున్నట్లు తెలిపారు. పూజ కార్యక్రమాల్లో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రాయితీపై దాణా సరఫరా

కొండాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ద్వారా రాయితీపై విడుదలైన పశువుల దాణాను గురువారం సాయిపేట గ్రామ పశువైద్యాధికారి మధుతో కలసి జిల్లా టెలికం బోర్డు డైరెక్టర్ తాటికొండ అనూష రైతులకు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం 50శాతం రాయితీపై ఇచ్చే పోషక విలువలు కలిగి నాణ్యతతో కూడిన దాణాను వినియోగించుకొని పాడిరైతులకు సూచించారు. అలాగే పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడంతోపాటు పాల ఉత్పత్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాడి రైతులు పీ తిరుపతయ్య, బంగారు నాయుడు, మాలకొండయ్య పాల్గొన్నారు.

89 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 376పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో ఎనిమిది కంపెనీ ప్రతినిధులు పాల్గొని 287బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-64, ఆర్‌ఆర్-8, సీఆర్-10, జంపింగ్ లాట్స్-7 కారణాలతో 89బేళ్లు తిరస్కరణకు గురయ్యా యి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.258.28గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి ఇసాక్ స్వరణ్‌దత్ తెలిపారు.

12న స్వరార్చన

కావలి, మే 8 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాక అన్నమాచార్యుల 617వ జయంతి సందర్భంగా ఈ నెల 12న పట్టణంలోని వాయునందనప్రెస్ వీధిలోని సంకలవారితోట రామాలయంలో 12వ తేదీ స్వరార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు గణపతిరాజు మారుతీరావు, టంగుటూరి జయశ్రీలు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందన్నారు.

విద్యుత్ విజిలెన్స్ బృందాల తనిఖీలు

● రూ. 3.2 లక్షల జరిమానా విధింపు

కందుకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో విద్యుత్ విజిలెన్స్ బృందాలు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 81మంది విద్యుత్ వినియోగదారులకు రూ. 3.2లక్షలు జరిమానా విధించారు. విద్యుత్ ఈఈ ఎం నాగేశ్వరరావు నేతృత్వంలో 30మంది అధికారులు, 50 మంది సిబ్బంది 34 బృందాలుగా ఏర్పడి నిర్వహించిన తనిఖీలలో 79మంది అదనపు విద్యుత్ వాడుతున్నట్లు గుర్తించి వారికి రూ. 3 లక్షలు జరిమానా విధించారు. అలాగే ఒక కేటగిరిలో విద్యుత్ కనెక్షన్ తీసుకుని వ్యాపార అవసరాలకు వాడుతున్న మరో రెండు సర్వీసులను గుర్తించి వారికి రూ. 20వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో డీఈఈ టీఎం రాఘవేంద్రరావు, ఆర్ విజయ్‌బాబు, పీ యుగంధర్, డివిజన్‌లోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



విజిలెన్స్ బృందాల తనిఖీల అనంతరం మాట్లాడుతున్న ఈఈ నాగేశ్వరరావు, విద్యుత్ శాఖ అధికారులు

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

కందుకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాలు ఈనెల 20వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సీఐటీయూ సమావేశంలో కార్మిక సమ్మె ఎందుకు అనే బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల పోరాటఫలితంగా కార్మికులు సాధించుకున్న 29 హక్కులను రద్దుపరిచి నాలుగు లేబర్ కోడ్‌లను విధించటం అన్యాయం అని, వెంటనే లేబర్‌కోడ్‌ను రద్దుచేయాలని కోరారు. సమ్మెలో భాగంగా ఈనెల 13న కందుకూరులో నియోజకవర్గ స్థాయి సదస్సు జరుగుతుందని, జిల్లా జాతా 15న కందుకూరు నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్కే సల్మా, ఎస్‌ఏ గౌస్, జీవీబీ కుమార్, ఎస్కే పద్మజ, కొట్టె వెంకయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ, శాంతి భద్రతలపై ప్రత్యేక గ్రీవెన్స్

● నేడు తహసీల్దారు కార్యాలయంలో కార్యక్రమం

అల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, శాంతి భద్రతల సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. కలెక్టరు ఆదేశాల మేరకు శుక్రవారం కావలి ఆర్డీవో, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలు, శాంతిభద్రతల సమస్యలపై ఫిర్యాదులు అందజేయవచ్చని కోరారు. కార్యక్రమంలో డీటీ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ ప్రభు పాల్గొన్నారు.

● రేషన్ కార్డుల మంజూరును వినియోగించుకోండి

రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్‌కార్డుల మంజూరుకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. కార్డులు పొందాల్సిన వారు, పేర్లు మార్పుచేర్పులు చేసుకోవాలని కోరారు. అలాగే ఆదాయ పన్ను చెల్లించే ప్రతిఒక్కరూ తమ రేషన్ కార్డులను తహసీల్దారు కార్యాలయంలో అప్పగించాలన్నారు.



సమావేశంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ

మానవత్వం చాటుకున్న కావలి ఎమ్మెల్యే

కావలి, మే 8 (ఆంధ్రజ్యోతి): రక్తపు మరకలతో రోడ్డుపై పడి ఉన్న మహిళను వెంటనే ఆటోలో తన అనుచరులతో ఆసుపత్రికి పంపించి ఆమెకు వైద్య చికిత్సలు అందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి. గురువారం ఉదయం ఆయన పట్టణంలోని ఓ కార్యక్రమానికి వెళుతుండగా ట్రంకురోడ్డులోని రూపాయి మిద్దెసెంటర్‌లో పడిఉన్న మహిళను చూసి అందరూ రోడ్డు మార్జిన్‌లో వెళుతుండటాన్ని ఎమ్మెల్యే గమనించారు. వెంటనే కారు దిగి వెళ్లారు. యాచకురాలిని గుర్తుతెలియని వాహ నం ఢీకొనటంతో ఆమె రక్తపు మరకలతో రోడ్డు పై పడి స్పృహ కోల్పోయి ఉంది. ఆసుపత్రికి చేర్చిన అనంతరం వైద్యులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆమెకు తల పగిలి ఉండటంతో రెండు కుట్లు వేసినట్లు సమాధానం ఇవ్వడంతో ఆమె కోలుకునే వరకు వైద్యసేవలు అందించాలని సూచించారు.



రోడ్డుమీద పడి ఉన్న యాచకురాలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకట క్రిష్ణారెడ్డి

బిల్లుల మంజూరులో నిర్లక్ష్యంను వీడాలి

అల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల బిల్లుల మంజూరులో నిర్లక్ష్యం వహిస్తే సహించమని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిదర్ అన్నారు. గురువారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. గోకులం పథకం కింద లబ్ధిదారులకు మంజూ రైన బిల్లుల విషయంపై అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లుతో చర్చించారు. స్థానిక సమస్యలను ఆయా గ్రామాల నాయకులు, సర్పంచులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ఆయన గుర్తుచేసి వివరణ అడిగి తెలుసుకున్నారు. అలాగే పలురకాల ఉపాధి హామీ పనులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు జాగ్రత్తగా వ్యవహరించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, ఎంపీడీఓ రజనీకాంత్, స్థానిక నాయకుడు పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీద గిరిధర్

నా ప్రమేయం లేదు !

● పైలాన్ కూల్చివేతపై తిరువీధి ప్రసాద్ ప్రమాణం

కావలి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): పైలాన్ కూల్చివేతలో తానే ప్రధాన వ్యక్తినంటూ వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని తనకు అందులో తనకు ఎలాంటి సంబంధం లేదని టీడీపీ నాయకులు తిరువీధి ప్రసాద్ గురువారం కలుగోళశాంభవి అమ్మవారి ఆలయంలో ప్రమాణం చేశారు. వైసీపీ నేతలు ఇటీవల విలేకరుల సమావేశంలో తిరివీధిపై చేసిన ఆరోపణలకు ఆయన స్పందించి ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసీపీ నేతలకు చిత్తశుద్ధి వుంటే గురువారం ఉదయం 11గంటలకు ఆలయానికి వచ్చి ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. పైలాన్ కూల్చిందెవరో ప్రజలకు తెలుసునని త్వరలో అన్ని నిజాలు నిగ్గు తేలుతాయన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు పసలేని ఆరోపణలు దుష్ప్రచారం చేయడం మానుకోవాలన్నారు.

డ్రోన్‌తో పరిశీలన

కావలి రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): రైల్వే ట్రాక్ పరిసరాల్లో అసాంఘిక కార్యక్రమాలు అరికట్టేందుకే డ్రోన్ నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ రమాదేవి తెలిపారు. గురువారం ఆయన పట్టణ రైల్వే స్టేషన్, స్టేషన్ పరిసరాల్లో డ్రోన్ ఎగుర వేసి ట్రాక్ పరిసరాలు పరిశీలించి మాట్లాడారు. స్టేషన్ పరిసరాలు, ప్లాట్‌ఫాంలపై అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకుకు మద్దతు ధర అందించాలి : చైర్మన్

కలిగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పొగాకునకు మద్దతు ధర అందించాలి పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ పొగాకు కంపెనీలకు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి వేలం ప్రక్రియ, ధరల విధానం, నోబిడ్ బేళ్లను పరిశీలించారు. అనంతరం సాగు దారులతో మాట్లాడారు. మార్కెట్‌కు అనుగుణంగా నాణ్యతా పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు చేస్తున్న కంపెనీ ప్రతినిధులు గ్రేడింగ్ ప్రకారం రైతుకు పూర్తి మద్దతు అందించడంతో పాటు అన్నిరకాల గ్రేడ్‌లను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కోరారు. మార్కెట్ ధరలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తూ రైతు అభ్యున్నతికి పాటుపడాలని బోర్డు అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి ఇసాక్ స్వరణ్‌దత్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పొగాకు బోర్డు వద్ద రోడ్డు ప్రమాదం

● రైతుకు తీవ్ర గాయాలు

కలిగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి):స్థానిక పొగాకు బోర్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కమ్మవారిపాలెంకు చెందిన పొగాకు రైతు కాట్రగుంట రాఘవేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. కలిగిరి పట్టణం నుండి ద్విచక్ర వాహనంపై పొగాకు బోర్డు లోపలికి వేళ్లే క్రమంలో సంగం నుంచి పామూరు వెళ్తున్న కారు ఢీకొనడంతో తల, కాళ్లపై గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని స్థానిక ప్రైవేట్ వైద్యశాలలో ప్రథమచికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారును స్వాధీనం చేసుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

పీఎంఏవై గృహాలకు త్వరలో ప్రతిపాదనలు : డీఈ

లింగసముద్రం, మే 8 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలో ప్రధానమంత్రి ఆవాస యోజన కింద గృహాల మంజూరుకు త్వరలో ప్రతిపాదనలు పంపించనున్నట్లు గృహ నిర్మాణశాఖ డీఈ పీవీ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఆయన గృహ నిర్మాణశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఇప్పటివరకు గృహాల కోసం కందుకూరు రూరల్ మండలంలో 1034 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో రెవెన్యూ అధికారులు 574 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చారని, కందుకూరు అర్బన్‌లో 194 మంది దరఖాస్తు చేసుకోగా, 58 మందికి, గుడ్లూరు మండలంలో 1833 మంది దరఖాస్తు చేసుకోగా 1275 మందికి, ఉలవపాడు మండలంలో 1628 మంది దరఖాస్తు చేసుకోగా 733 మందికి, వలేటివారిపాలెం మండలంలో 1612 మంది దరఖాస్తు చేసుకోగా 1338 మందికి, లింగసముద్రం మండలంలో 1138 మంది దరఖాస్తు చేసుకోగా 838 మందికి పీసీలు ఇచ్చారని తెలిపారు. ఇవిగాక కందుకూరు అర్బన్‌లో ఇంటిస్థల పట్టాలున్న 441 మందికి గృహాలు మంజూరయ్యాయని, వీరు వెంటనే పునాదులు నిర్మించుకోవాలని చెప్పారు. ఇంకా గృహాలు అవసరమైన వారు తమ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏఈ జె నాగరాజు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా సీతారాముల కల్యాణం

ఉదయగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి గ్రామంలో కోదండరామస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్ల కల్యాణాన్ని తిలకించారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదానంతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆపరేషన్ సిందూర్‌పై హర్షం

దుత్తలూరు (ఉదయగిరి), మే 8 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడులు చేయడంపై బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పహల్గాం దాడికి దీటుగా భారత్ సైన్యం జవాబు ఇవ్వడం అభినందనీయమన్నారు. శక్తివంతమైన నిర్ణయానికి నాయకత్వం వహించిన దేశ ప్రధాని నరేంద్రమోదీకి ప్రజలంతా కృతజ్ఞతలు తెలియజేయాలన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఏఎస్ పేట, మే 8 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న సబ్సిడీ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో ప్రసాద్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 33మందికి రుణాలు అందిస్తామని, ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఏపీవో బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి, మే 8(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మండల ఇన్‌చార్జి ఏపీవోగా కేటీ ఉమామహేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలిగిరి మండల ఏపీవోగా పని చేస్తున్న ఆయనకు ఉన్నతాధికారులు అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు.

సోమశిలలో 50.562 టీఎంసీల నీరు

అనంతసాగరం మే 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో గురువారం నాటికి 50.562 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1,230, ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. 275 క్యూసెక్కులు ఆవిరి అవుతున్నట్లు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయం

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నిరుద్యోగులకు, మహిళలకు, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలోని స్త్రీశక్తి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ సహకారంతో ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నియో జకవర్గంలోని 8 మండలాల్లో కుట్టు శిక్షణా తరగతులు జరుగుతాయని, ఇప్పటికి మూడు మండలాల్లో ప్రారంభించడం జరిగిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు వెయ్యి మంది వరకు శిక్షణ పొందుతారన్నారు. గతంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సుమారు 500మంది కుట్టు శిక్షణ నేర్చుకున్నారన్నారు. రెడీ మేడ్ బట్టల తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తే అందరికీ ఉపాధి కలుగుతుందని, ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కోఆర్డినేటర్ పద్మ వీటిని పర్యవేక్షిస్తున్నారన్నారు. ఈ అవ కాశాన్ని వినియోగించుకుని నేర్చుకున్న ప్రతి మహిళా ఉచిత కుట్టు మిషన్ పొందా లన్నారు. కాగా, ఉగ్రవాదుల చేతిలో భరతమాత బిడ్డలు ప్రాణాలు విడిచారని, భారత పౌరులందరూ ఒక సైన్యంలా మారి ఎటు వంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కో వాలన్నారు. భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంక టేశ్వర్లుయాదవ్, మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కోడూరు నాగిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, జడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, జనసేన మండల కన్వీనర్ బండారు సత్యనారాయణ, నాయకులు గణపం సుదర్శన్‌రెడ్డి, వనిపెంట సుబ్బారెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలి : ఎంపీడీవో

ఉదయగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధిహామీ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం అధిగమించాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధి పని కల్పించాలన్నారు. కొలతల ప్రకారం కూలీలు పని చేసేలా చర్యలు చేపట్టి గిట్టుబాటు కూలి వచ్చేలా చూడాలన్నారు. పంట, ఇంకుడు గుంతలు, నీటితొట్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఉమామహేష్, ఈసీ సువార్తయ్య, టీఏలు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీవో అప్పాజీ

నేడు టీడీపీలోకి వైసీపీ శ్రేణులు

ఉదయగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలం లోని గండిపాళెం పంచా యతీకి చెందిన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, జీ ఎంకే ట్రస్టు అధినేత గుంటుపల్లి మాలకొండ య్య చౌదరి ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలోకి భారీగా నాయకులు, కార్య కర్తలు, అభిమానులు చేరనున్నారు. అందులో భాగంగా గురువారం తన నివాసంలో నాయకులు, కార్యకర్తలతో గుంటుపల్లి సమా లోచనలు చేశారు. ఈసందర్భంగా గుంటుపల్లి ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య, సర్పంచ్ గొల్లపల్లి కల్పన, మాజీ సర్పంచ్ రాపల్లి భారతీ, ముస్లిం మైనారిటీ నాయకులు తమ అనుచరులు సుమారు 250 కుటుంబాలతో కలిసి శుక్రవారం వింజమూరు టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమయ్యారు.

తప్పుడు కేసులు పెట్టడం వైసీపీ నేతలకే చెల్లు

బిట్రగుంట, మే 8 (ఆంధ్రజ్యోతి): కక్షపూరితంగా తప్పుడు కేసులు పెట్టి టీడీపీ నేతలను ఇబ్బందులకు గురిచేసింది వైసీపీ నేతలకే చెల్లిందని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు అన్నారు. బోగోలులోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయల నిధులతో ఏర్పాటు చేసిన పైలాన్‌ను పగులకొట్టించింది మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఆయన అనుచరులు కాదా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ పాల నలో జరుగుతున్న అభివృద్ధిని చూపి ఓర్వలేక ఈర్షతో బురదజల్లే వ్యాఖ్యలు ఇప్పటికైనా మాను కోవాలని సూచించారు.

ఆత్మకూరులో చిరుజల్లులు

ఆత్మకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న ఎండలతో అల్లాడుతున్న ప్రజలు గురువారం మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా చల్లబడి చిరుజల్లులు కురవడంతో ఉపశ మనం పొందారు. ఎండలకు అవస్థలు పడుతున్న వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు చిరుజల్లులతో ఊపిరి పీల్చుకున్నారు.

మధుసూదన్‌కు ఘన నివాళి

కావలి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిలో మృతిచెందిన కావలి వాసి సోమిశెట్టి మధుసూదన్‌రావు ఉత్తరక్రియలు గురువారం ఏవీఎస్ కల్యాణ మండపంలో చేపట్టారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెల్యే కిష్టారెడ్డితోపాటు వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంఘాలు, బంధుమిత్రులు పాల్గొని మధుసూదన్‌రావు చిత్రపటానికి నివాళుల ర్పించారు. మాజీ కౌన్సిలర్లు రాజ్‌కుమార్ చౌదరి, అమరా వేదగిరి, టీడీపీ నేత అల్తార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఆళహరి సుధాకర్, నూనె మల్లికార్జున యాదవ్, జిల్లా కార్యదర్శి సమ్మెట వెంకటసుబ్బయ్య, శ్రీధర్, భరత్‌కుమార్, బ్రహ్మానందం, కిరణ్‌కుమార్ నివాళులర్పించారు.

తడకలూరులో ర్యాలీ

దగదర్తి (బిట్రగుంట) : తడకలూరులో గురువారం మోడల్ మండల టీం లీడర్ హరిచందన ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ చైతన్య ర్యాలీ నిర్వహించారు. గ్రామ రైతులతో కలిసి స్థానిక టీడీపీ నేత శ్రీహరినాయుడు ప్లేకార్డులు పట్టుకుని ప్రకృతి వ్యవసాయం చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని నినాదాలు చేశారు.

వైభవంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి

సంగం, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ బజార్‌లో ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజ లు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వాసవీ కన్యకాపరమేశ్వరికి పూజలు చేస్తున్న అర్చకులు

చలివేంద్రం ప్రారంభం

సీతారామపురం, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బాలాయపల్లి పంచాయతీలోని పోకలవారి పల్లె గ్రామంలో కాకి జాన్ చిన్నయ్య, సంతోషమ్మ జ్ఞాపకార్థం మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం మండల టీడీపీ నాయకులు, మాజీ కన్వీనర్ మొత్తంశెట్టి చెన్నకేశవులు, చింతల శ్రీనివాసులు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జాషువా చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, కాకి సాల్మన్, మండల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల నలుగురు మృతి చెందగా వారి కుటుంబ సభ్యు లకు సాంబశివ చారి టబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర రెడ్డి గురువారం వారి ఇళ్లకు వెళ్లి ఆర్థిక సాయం అంద జేశారు. 2వ వార్డు పరిధిలోని కప్పల పెంచలయ్య, షేక్ అమీర్‌బీ, 19వ వార్డు పరిధిలో కప్పల కాంతమ్మ, షేక్ సంధాని కుటుంబాలను ఆయన పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల వంతున ఆర్థిక సహాయం అందజేశారు.

కెనరా బ్యాంక్‌లో సిబ్బంది కొరత

● ఖాతాదారుల అవస్థలు

ఏఎస్ పేట, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కావలి ఎడవల్లి గ్రామంలోని కెనరా బ్యాంక్‌లో సిబ్బంది కొరతతలో ప్రతిరోజు ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం పలు గ్రామాల నుంచి ఖాతాదారులు బ్యాంక్‌కు విచ్చేశారు. ఉదయం వచ్చి సాయంత్రం వరకు బ్యాంక్‌లో వేచిఉన్నా పనులు కాలేదని పలువురు ఖాతాదారులు కఖవాపోయారు. సుమారు 14 గ్రామాల ప్రజలు ప్రతిరోజు బ్యాంక్‌కు విచ్చేస్తుంటారు. బ్యాంక్‌లో ఐదుగురు ఆఫీసర్లకు గాను ఇద్దరే ఉన్నారని, దీంతో ఇబ్బందులు తప్పడం లేదని, పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని ఖాతాదారులు కోరుతున్నారు.

క్యారమ్స్‌తో మానసిక ఉల్లాసం

వింజమూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు గురువారం క్యారమ్స్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జ్యోతి కొండయ్య మాట్లాడుతూ అన్ని వయస్సుల వారు క్యారమ్స్ ఆడేందుకు ఆసక్తి చూపుతారని, దీని వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100) : 500

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9,437
వెండి కిలో ధర	రూ. 98,100
వెండి ఒక గ్రాము	రూ.101.10

బర్మాషెల్‌గుంట పేదలకు అండగా ఉంటాం : ఆర్‌పీఐ

నెల్లూరు (హరనాథపురం) : నగరంలోని బర్మాషెల్‌గుంట వాసులకు అండగా ఉంటామని ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు షేక్.మాబు చెప్పారు. గురువారం ఆయన బర్మాషెల్‌గుంటలో పర్యటించి, మాట్లాడారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఏ ప్రభుత్వ స్థలంలో నివాసం ఉన్నా, వారికి పరిహారం, పునరావాసం కల్పించకుండా ఇళ్లు తొలగించకూడదన్నారు. రైల్వేస్థలాల్లో నివాసం ఉన్న బాధితులందరికీ పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఐ నాయకులు పట్టపు రంగారావు, బత్తల మధుసూదన్, దుంపల సుబ్బారావు, ఉప్పల మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు సాహితీ పురస్కార సభ

నెల్లూరు (సాంస్కృతికం) మే 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మాగుంట లేఅవుట్ లోని ఎస్ఆర్‌కే విశ్వసాయి స్కూలులో శనివారం గోవిందరాజు సీతాదేవి సాహితీ పురస్కార సభ నిర్వహించనున్నట్లు బాలభవన్ డైరెక్టర్ జీ.సుభద్రాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు జరిగే ఈ సభలో అద్దేపల్లి ప్రభు, డాక్టర్ సుంకరగోపాల్, డాక్టర్ పెళ్లూరుసునీల్, ఏవీఎం.నాగగాయత్రి అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ పురస్కారాన్ని తిరుపతికి చెందిన ఆర్‌సీ. కృష్ణంరాజు (మేకలబండ), శ్రీకాళహస్తికి చెందిన కేపీ.మునిసురేష్ పిళ్లై (గారడీ)లకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగే కవి సమ్మేళనంలో ముగ్గురు విజేతలకు నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు.

11 నుంచి ఉచిత స్కేటింగ్ శిక్షణ

నెల్లూరు(విద్య), మే 8 (ఆంధ్రజ్యోతి) : డీఎస్ఏ సహకారంతో రోలర్‌స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి నగరంలోని చిల్డ్రన్స్‌పార్కులో ఉచిత వేసవి స్కేటింగ్ శిక్షణను నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుధీర్‌కుమార్‌రెడ్డి, కే.కామేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 16 ఏళ్ల వయసు లోపల ఆసక్తి కలిగిన బాల, బాలికలు శిక్షణలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారు చిల్డ్రన్స్‌పార్కులో స్కేటింగ్ కోచ్‌లు విశ్వనాథ, షౌకత్‌అలీఖాన్‌ల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

మూలవిరాట్ తొలగింపు

నెల్లూరు (సాంస్కృతికం) మే 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేటలో ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం పంచనామా కార్యక్రమం జరిగింది. ఆలయం శిథిలావస్థకు చేరడంతో పునర్‌నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదించింది. సుమారు 15.60లక్షలతో అత్యాధునిక వసతులతో ఆలయ పునర్‌నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పోలీసు, రెవెన్యూ, దేవదాయ శాఖల అధికారుల సమక్షంలో ఆలయంలోని విగ్రహాలు తొలగించి, వాటిని ధాన్యాగారంలో భద్రపరిచారు. రంగనాథ స్వామి ఆలయం ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, వేణుగోపాలస్వామి ఆలయ అర్చకులు శ్రీనివాస అయ్యంగార్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, ఇన్‌స్పెక్టర్ (దేవదాయ) 39, 40వ సచివాలయాల కార్యదర్శులు సరస్వతి, ప్రశాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేథా దక్షిణామూర్తి స్వామికి విశేష పూజలు

సైదాపురం, మే 8(ఆంధ్రజ్యోతి):మండలంలోని సిద్దేశ్వరకోన ఆవరణలో ఉన్న మేథా దక్షిణామూర్తి స్వామి దేవస్థానంలో గురువారం స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సైదాపురం, కలిచేడు, చాగణం గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో పూజలు నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు.

త్వరితగతిన సర్వేలు పూర్తిచేయాలి

సైదాపురం, మే 8 (ఆంధ్రజోతి):స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న వివిధరకాల సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చిన్నపిల్లల జనన ధ్రువపత్రాలు జారీ చేసిన వెంటనే ఆధార్ నమోదు చేయించాలన్నారు. శుక్రవారం ఉదయం నుంచి చాగణం సచివాలయం వద్ద ఆధార్ శిబిరం నిర్వహించనున్నట్లు, రాహూరు బెల్ట్ సచివాలయ సిబ్బంది అవసరమైన వారిని తీసుకెళ్లాలని ఆదేశించారు. 11న కలిచేడులో ఆధార్ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పూడికతీత పనులు చేపట్టాలి

విడవలూరు, మే 8(ఆంధ్రజ్యోతి): చౌకిచర్ల చెరువు కింద ఉన్న సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి రైతులను ఆదుకోవాలని చౌకిచర్ల చెరువు నీటిసంఘం ఉపాధ్యక్షుడు సమాధి శ్రీనివాసులు తెలిపారు. ఈ విషయంపై గురువారం ఆయన చౌకిచర్లలో విలేకర్లతో మాట్లాడారు. చెరువు నుంచి 1,2,4,7 తూములు కింద ఉన్న కాలువలు పూర్తిగా పూడిపోయి ఉన్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఈదూరు సురేష్, మిట్టా అంకయ్య పాల్గొన్నారు.

పదో రోజుకు వేసవి విజ్ఞాన తరగతులు

నెల్లూరు (సాంస్కృతికం) మే 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. 10వరోజు గురువారం విద్యార్థులకు పుస్తక పఠనం, క్విజ్, యోగా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్, మోటివేటర్లు సతీష్ కుమార్, సుబ్బారావు, లైబ్రరీ సిబ్బంది, జితేంద్ర, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవాలయ శిఖర ప్రతిష్ఠలో సోమిరెడ్డి



యాగశాల వద్ద ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరురూరల్, మే 8,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం ఎస్సీ కాలనీలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ వేడుకలో ఆయన కలశాలను తీసుకుని ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం యాగశాల వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. గ్రామంలో ప్రజలంతా పాడి,పంటలతో సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీకుమార్‌రెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మేకల అనిల్, హరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కొత్త బస్సుల ప్రారంభం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో గురువారం ఏడు కొత్త బస్సులను నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెల్లూరు రీజియన్‌కు 133 కొత్త బస్సులను కేటాయించిందన్నారు. ఆర్టీసీ సంస్థను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ నాగేంద్ర ప్రసాద్, ఆర్ఎం మురళీబాబు, సీటీఎం షేక్ షమీమ్, డీఎంలు మురళికృష్ణ, శివకేశవ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో ప్రమాణాలు కలిగిన పరికరాలు వినియోగించాలి

నెల్లూరు (వెంకటేశ్వరపురం) మే 8 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు బరువు,తూకాల కొలతల్లో సరైన ప్రమాణాలు కలిగిన పరికరాలు ఉపయోగించాలని లీగల్ మెట్రాలజీశాఖ అధికారి కే.ఐసాక్ పేర్కొన్నారు. ప్రపంచ మెట్రాలజీ 150వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులకు అవగాహన చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చెల్లించే నగదుకు సరిపడా సరుకును ఇవ్వాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందన్నారు. అలా చేయకుంటే కొనుగోలు దారుడు ఫిర్యాదు చేసేందుకు హక్కును పొందుతాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎస్ ఈశ్వరరావు,సీఐ రియాజ్‌అహమద్, నాగేశ్వరరావు,గఫూర్ పాల్గొన్నారు.

25న యాదవ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు

నెల్లూరు(విద్య), మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతిబా పురస్కారాలు అందుకునేందుకు యాదవ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని యాదవ ఎంప్లాయిస్, ప్రొఫెషినల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం అసోసియేషన్ ఆధ్వర్యంలో గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. టెన్త్ ఫలితాల్లో నూతన జిల్లా పరిధిలో 470 మార్కులకు పైన సాధించిన యాదవ విద్యార్థులకు ఈనెల 25న యాదవభవన్‌లో పురస్కారాలు అందచేస్తామన్నారు. అర్హత కలిగిన విద్యార్థులంతా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి వీ.కొండయ్య, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చెవుల రామచంద్రయ్య, నేతలు పాల్గొన్నారు.

టిడ్కో చైర్మన్‌ను కలిసిన జనసేన నేత కిషోర్ దంపతులు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 8 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌ను జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ దంపతులు గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అస్వస్థతతో కొద్ది రోజులుగా విశ్రాంతి తీసుకుంటున్న వేములపాటిని వారు కలిసి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ఆయనకు ఆరోగ్యం సరిగా లేకపోయినా జనసేన బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నామన్నారు.

ఆదిశంకరుల పాదుకలకు అర్చన

నెల్లూరు (సాంస్కృతికం) మే 8 (ఆంధ్రజ్యోతి) :నగరంలోని పొగతోట ఆదిశంకర ధ్యానమందిరంలో జరుగుతున్న ఆదిశంకరాచార్యుల సంస్మరణ ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఆదిశంకరాచార్యుల పాదుకలకు భక్తిశ్రద్ధలతో అర్చనలు జరిగాయి. అనంతరం గంభీరానందభారతీ మహాస్వామి ప్రవచనం జరిగింది. సాయంత్రం గాయకులు వీవీ.వినోద్‌కుమార్ బృందంచే సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధ్యాన మందిరం కమిటీ సభ్యులు, చక్రాల వారి ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరుడికి బండాసురవధ అలంకారం



నెల్లూరు (సాంస్కృతికం) మే 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలలో భాగంగా స్వామివారికి గురువారం బండాసుర వధ అలంకారం నిర్వహించారు. ఉదయం మూలస్థానేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు, పూలంగిసేవలు జరిగాయి. సాయంత్రం విశేష పూజలు బండాసుర వధ అలంకారంలో స్వామివారికి తోటలో విశేషపూజలు, ప్రాకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాలను ఉభయకర్తలు, ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి, అర్చకులు పర్యవేక్షించారు.

శేషవాహనంపై కాశీవిశ్వనాథుడు

నెల్లూరు (సాంస్కృతికం) మే 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేట అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథుడి ఆలయ బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం ధ్వజారోహణం జరిగింది. స్వామివారికి విశేష అలంకారం, పూజలు చేసి అనంతరం ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం కొడిముద్దల వేడుక జరిగింది. కొడిముద్దల కోసం సంతానం కోరుకునే మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం హోమం, విశేష పూజలు, పూలంగిసేవలు జరిగాయి. అనంతరం శేషవాహనంపై స్వామివారికి పేట ఉత్సవం జరిగింది. ఈ ఉత్సవాల్లో పత్తి జయరామయ్యనాయుడు, కొలపర్తి రమేష్, ఆడిటర్ రాఘవేంద్రరావు, ఉభయకర్తలు,ఈవో జీ.దర్గయ్య,అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాక్ పనిబట్టిన మహిళా సైనికులు

నెల్లూరు (హరనాథపురం) (ఆంధ్రజ్యోతి): వీర మహిళా సైనికులు పాకిస్తాన్ భరతం పట్టారని భారత సేవా ఫౌండేషన్ కార్యదర్శి షేక్.ఖాసిం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాకిస్తాన్‌లో ఉగ్రవాదుల స్థావరాలను మట్టుపెట్టేందుకు వీర మహిళా సైనికులు ఆదేశంలోకి చొచ్చుకువెళ్లడం కొనియాడతగిందన్నారు.

ప్రజల్లో ఉంటేనే నాయకులవుతారు : రూరల్ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, మే 8,(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజల్లో ఉండి, వారి సమస్యలపై స్పందిస్తుంటేనే నాయకులు కాగలరని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ డివిజన్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. డివిజన్లలో నిరంతరం పర్యటిస్తూ ఉంటేనే ప్రజలు గుర్తిస్తారని తెలిపారు. స్థానిక సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈనెల 15న 339 అభివృది పనులను ఏకకాలంలో ప్రారంభించనున్నామని ఆయన వివరించారు. స్థానికులు పాల్గొనేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ, శోభరాణి, అరవ శ్రీను, రఘు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయవద్దు : కమిషనర్

నెల్లూరురూరల్, మే 8,(ఆంధ్రజ్యోతి): వేసవి తాపం ఎక్కువగా ఉన్న ఈ సమయంలో నగరంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి రానీయవద్దని ఎన్ఎంసీ కమిషనర్ వైవో నందన్ అధికారులను ఆదేశించారు. గురువారం 30వ డివిజన్ పరిధిలోని వైఎస్ఆర్‌నగర్, మల్లయ్యగుంట తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. నీటి వనరులన్నింటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. చేతిపంపులను అందుబాటులోకి తీసుకురావాలని, వాటి మరమ్మతులు పూర్తి చేయించాలన్నారు. అనంతరం 37,17వ డివిజన్లలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి

నెల్లూరు(సిటీ), మే 8,(ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మేయర్ స్రవంతికి సీఐటీయూ నాయకులు, కార్మికులు గురువారం వినతిపత్రం అందచేశారు. మూడు రోజులుగా తమ సమస్యల పరిష్కారానికి కార్పొరేషన్ ఎదుట ఆందోళన నిర్వహించామని తెలిపారు. 62 ఏళ్లకు పదవీ విరమణ వయసు పెంచి, అనంతరం వారి కుటుంబాలలోని వారసులకు పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంచల నరసయ్య, కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందజేత

నెల్లూరు (వెంకటేశ్వరపురం) మే 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కోటమిట్టలో వైసీపీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సిద్దిక్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత ఖత్నా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి చిన్నారులకు నిత్యావసర వస్తువులు,పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు వైసీపీ ఎల్లపుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో 42 డివిజన్ కార్పొరేటర్ కరీముల్లా, ఖలీల్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేసేవరకు సమ్మె ఆగదు

నెల్లూరు (వైద్యం) మే 8 (ఆంధ్రజ్యోతి) : తమకు న్యాయం చేసే వరకు చేస్తున్న సమ్మె ఆగదని కమ్యూనిటీ హెల్త్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాను మహేష్ పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద వైద్య ఉద్యోగులు చేస్తున్న నిరసన కార్యక్రమం 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కళ్లకు నల్లరిబ్బన్‌లు గంతలు కట్టుకుని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ డిమాండ్‌లను పరిష్కరించాలన్నారు. సమ్మెలో గర్భిణులు, మహిళలు ఎక్కువగా ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని నమ్ముతున్నామన్నారు. హెచ్‌ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, బదిలీ, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కో ఆర్డినేటర్ ఆదిల్, ఉపాధ్యక్షురాలు రెబెనా, జిల్లా కమ్యూనిటీ అధికారులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కాలనీలో విజయోత్సవ ర్యాలీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం) మే 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని భగత్‌సింగ్‌కాలనీలో పట్టాలు మంజూరు చేయడంపై స్థానిక టీడీపీ నాయకుడు ముజీర్ ఆధ్వర్యంలో గురువారం మంత్రి నారాయణ చిత్రపటంతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముజీర్ మాట్లాడుతూ అసాధ్యాన్ని సుసాధ్యం చేయడం మంత్రి నారాయణకు సాధ్యమైందన్నారు. ఆయనకు భగత్‌సింగ్‌కాలనీ ప్రజలు ఎల్లవేళలా కృతజ్ఞతతో ఉంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనురాధ,నాయకులు మునీర్,అన్వర్ స్థానికులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా.. గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు



అసంపూర్తిగా రేగడిచెలిక పంచాయతీలోని విలేజ్ హెల్త్ క్లినిక్

కొడవలూరు, మే 8 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీంతో గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు సకాలంలో అందడం లేదు. ఈ అసంపూర్తి భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారినట్లు పలువురు వాపోతున్నారు. మండలంలో 24 పంచాయతీల్లో 14విలేజ్ హెల్త్ క్లినిక్ భవన్ నిర్మాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటిలో రెండు మాత్రమే పూర్తయి ఒకటి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఎక్కడ వీటి నిర్మాణాలు పర్తికాలేదు. మండలంలోని రెడ్డిపాలెం పంచాయతీలో 1,500ల మంది నివాసం ఉండగా విలేజ్ హెల్త్ క్లినిక్ అందుబాటులో లేకపోవడంతో అక్కడ ప్రజలు వైద్యం కోసం ఇతర గ్రామాలు.. పట్టణాలకు వెళుతున్నారు. ప్రభుత్వం స్పందించి హెల్త్ క్లినిక్‌ల భవనాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

తోటపల్లిగూడూరు,మే 8 (ఆంధ్రజ్యోతి): మల్లికార్జునపురంలో గురువారం అధికారు లు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం పరిరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరించి ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టిన రైతులను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ స్మార్ట్ విలేజ్ కమిటీ సభ్యులు దానయ్య, సునీత, కల్పన, స్థానికులు తాళ్లూరు జీవరత్న, వార్డు సభ్యులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కామాక్షితాయి ఆలయ హుండీల లెక్కింపు



హుండీ లెక్కింపులో పాల్గొన్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం,మే8 (ఆంధ్రజ్యోతి):దేవాదాయ,ధర్మ దాయశాఖ అధికారుల సమక్షంలో జొన్నవాడ మల్లి కార్జున స్వామి, కామాక్షితాయి ఆలయ హుండీల లెక్కింపు చేపట్టారు. 44రోజులకు గాను భక్తుల కానుకలతో రూ.19.27లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అలాగే బంగారం, వెండి కానుకలు ఉన్నట్లు తెలిపారు. హుండీల లెక్కింపులో ఆ శాఖ అధికారులుశ్రీనివాసులురెడ్డి, ఏపీజీ బ్యాంకు అధికారులు, ఆలయ సిబ్బంది, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత ఉద్యోగులు అధికారులు పాల్గొన్నారు.

రెండో పంటకు సాగునీరు విడుదల



పూజలు చేస్తున్న నీటి సంఘాల అధ్యక్షులు

విడవలూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): చౌకిచర్ల చెరువు నుంచి గురువారం నీటి సంఘాల అధ్యక్షులు దూది విజయ రాఘవన్, ఉపాధ్యక్షులు సమాధి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈస్టల్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, మండల పరిశీలకులు అడపాల శ్రీధర్‌రెడ్డిలు మాట్లాడారు. చౌకిచర్ల చెరువు కింద 3వేల ఎకరాలు సాగులో ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రెండోపంటకు సక్రమంగా నీరందక రైతులు ఇబ్బందులు పడిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు అరగల వినోద్, టీడీపీ నాయకులు ఓగు నాగేశ్వరరావు, కొమ్మి శ్రీధర్‌నాయుడు, ఈదూరు సురేష్, మాజీ ఎంపీటీసీ కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, రైతు పొలిరెడ్డి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'హత్యా రాజకీయాలను ప్రోత్సహించం'

బుచ్చిరెడ్డిపాళెం, మే 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, పార్టీలో ఎవరూ ఎలాంటి హత్యా రాజకీయాలను ప్రోత్సహించారని టీడీపీ మండల నాయకులు ఎంవీ. శేషయ్య, బత్తల హరికృష్ణ, అన్నారు. గురువారం బుచ్చిరెడ్డిపాళెంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పోలినాయుడుచెరువుకు చెందిన ఎస్‌కే.పెద్దరఫీ హత్య కేసులో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించలేదని, ఆ గ్రామానికి వెళ్లాలంటే ఎమ్మెల్యేకి భయంగా ఉంటే తాము తోడు ఉంటామని అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. హత్యకు గురైన వ్యక్తి, హత్య చేసిన వారూ వైసీపీకి చెందిన వారేనని తెలిపారు. అందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏటూరి శివరామకృష్ణారెడ్డి, దొడ్ల కోదండరామి రెడ్డి, నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, మహేంద్ర, రమణారెడ్డి, మస్తానయ్య, నాగూర్ బాబు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

● ఫారెస్టు రేంజర్ మాల్యాద్రి



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న రేంజర్ మాల్యాద్రి

సైదాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల్లో వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని నెల్లూరు ఫారెస్టు రేంజర్ మాల్యాద్రి హెచ్చరించారు. గురువారం మండలంలోని షాషైన్ వద్ద ఉన్న సెంట్రల్ నర్సరీని ఫారెస్ట్ సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తెల్లమద్ది, నేరేడు, నార ఏపీ, కానుగ, గంగిరావి, చింతరేల, చిందుగ, ఆకాశమల్లి, ఉసిరి, వేపరేల మొక్కలను పెంచడం జరుగుతుందన్నారు. నర్సరీలో మొక్కల పెరుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ఆగస్టు నెల తరువాత ఉచితంగా రైతులకు పంపిణీ చేసేందుకు 50 వేల దానిమ్మ, జామ, ఉసిరి, సీతాఫలం, టేకు, ఎర్రచందనం, తులసి మొక్కలను పెంచడం జరుగుతుందన్నారు. వన్య ప్రాణులు నీటి కోసం జన సంచారంలోకి వస్తే వాటిని సంరక్షించి అటవీ శాఖాధికారులకు సమాచారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, బీట్ ఆఫీసర్ రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఆక్వా రైతు భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



మాట్లాడుతున్న మత్స్యశాఖ ఏడీ చాన్‌బాషా

బుచ్చిరెడ్డిపాళెం, మే 8 (ఆంధ్రజ్యోతి):మండలంలో ప్రతిఆక్వా రైతు వారి భూములను ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మత్స్యశాఖ ఏడీ చాన్‌బాషా సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన ఆక్వా రైతులకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకాలపై అవగాహన కల్పించారు. మండలంలోని అనధికారికంగా సాగు చేస్తున్న 700ఎకరాల ఆక్వా సాగును రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందన్నారు. ఇందుకోసం మత్స్యశాఖ సిబ్బంది ఆక్వాకల్చర్ సాగు అవుతున్న ప్రతిగ్రామానికి వస్తారని వారికి రైతులు డాక్యుమెంట్లు, ఆధార్‌కార్డులు అందజేయాలన్నారు. చికెన్ వ్యర్థాల వాడకాలను పూర్తిగా నిలిపేయాలన్నారు. చేపల గుంతల్లో సాయిల్ పరీక్షలు చేసి నిర్ధారణ అయితే గుంతలకు లైసెన్స్ రద్దు చేయడంతో పాటు సబ్సిడీలు కూడా నిలిపివేస్తామన్నారు. అవసరం అయితే సొసైటీల రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. బీఎం ఎంఎస్ రైస్ పథకంపై అవగాహన కల్పించడంతో రైతుల్లో విశేష స్పందన వచ్చిందన్నారు. ఎఫ్ఎఫ్‌పీ ఫిష్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ సొసైటీలను గ్రామాల్లో రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. గ్రామాల్లో ఆక్వా రైతుల అవసరాలను తెలుసుకుని వాటిని మత్స్యశాఖ అధికారులకు తెలియజేస్తామన్నారు. సబ్సిడీలో క్లైమిషన్లు ఇప్పిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు రైతులు ఏడీని కోరారు. సమావేశంలో ఎఫ్‌డీఓ పొట్టియ్య, మండల ఆక్వా రైతులు పాల్గొన్నారు.

జెన్కో థర్మల్ కేంద్రంలో ప్రత్యేక మాక్‌డ్రిల్



మాక్ డ్రిల్ ప్రదర్శిస్తున్న సిబ్బంది

ముత్తుకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి):శత్రుదేశ విమాన దాడులు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నేలటూరు జెన్కో థర్మల్ కేంద్రంలో గురువారం ప్రత్యేక మాక్‌డ్రిల్ నిర్వహించారు. పోలీసు, రెవెన్యూ, ఫైర్ శాఖలతో పాటు ఎంతో కేంద్రం సిబ్బంది ఎయిర్ అటాక్ జరిగినపుడు ఏం చేయాలో ప్రదర్శించి చూపించారు. శత్రుదేశం నుంచి దాడులు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో జెన్కో సీఈ సుధీర్‌బాబు, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, జెన్కో ఎస్పీఎఫ్ అధికారి ఎంఎస్.రెడ్డి, విజిలెన్స్ అధికారి మురళీధర్, కృష్ణపట్నం సీఐ రవినాయక్, ఎస్ఐలు శ్రీనివాసులురెడ్డి, విశ్వనాథరెడ్డి, తహసీల్దారు స్వప్న, ఎంపీడీవో నాగమణి పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక.. మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, మే 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి మండలంలోని వీఎస్‌యూలో జరుగుతున్న జాతీయ అఖిల భారత అంతర యూనివర్సిటీల పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ సమగ్రతకు అందరి తోడ్పాటు అవసరం అన్నారు. వీఎస్‌యూలో జాతీయస్థాయి మెగా టోర్నీ జరగడం సంతోషకరం అన్నారు. అనంతరం కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటినీ సమానంగా చూడటమే క్రీడాస్ఫూర్తి అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

ఎండైనా.. వానైనా గంగమ్మ దర్శనమే

బండ వేషంలో భక్తజనం

నేడు తోటివేషం





తిరుపతి గంగ జాతరకు వర్షం పడటం సంప్రదాయం. జాతర మొదలైన మూడో రోజైన గురువారం వాన పడింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా, ఆ తర్వాత చిరుజల్లులుగా మొదలై ఓ మోస్తరు వర్షం కురిసినా భక్తులు వెనకడుగు వేయలేదు. శరీరమంతా రక్తం చిందినట్టు కుంకుమ రాసుకుని, కాటుక బొట్లు, తెల్లటి పూలు చుట్టుకుని వయోపరిమితి లేకుండా బండ వేషంలో గంగమ్మను దర్శించుకున్నారు. మిగతా భక్తులూ అమ్మవారి దర్శనానికి తరలి వచ్చారు. కొందరు చిత్ర, విచిత్ర వేషాలతో భయానకంగా కనిపించారు. ముందుగా వేశాలమ్మను.. ఆతర్వాత తాళ్లపాక పెదగంగమ్మ, తాతయ్యగుంట గంగమ్మ, అంకాళమ్మ అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. కాగా, వేశాలమ్మ బండవేషంలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం భక్తులు తోటి వేషధారణతో గంగమ్మను దర్శించుకుంటారు. ఎక్కువగా పిల్లలు ఈ వేషం వేస్తారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి





జాతర వేషాల్లో చిన్నారులు

చిత్తూరు డీసీసీబీపై సభాసంఘం

● కొణతాల నేతృత్వంలో అసెంబ్లీ కమిటీ ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో జరిగిన అవినీతి అక్రమాలపై చర్యలకు అడుగు పడింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో చోటు చేసుకున్న అవినీతి, నిధుల దుర్వినియోగం, అక్రమాలపై శాసన సభాసంఘం విచారణ చేపట్టనుంది. ఇందుకు సంబంధించి మాజీ మంత్రి, ప్రస్తుత అనకాపల్లె ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నేతృత్వంలో శాసనసభా కమిటీని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నియమించారు. చిత్తూరు డీసీసీబీతో పాటు రాష్ట్రంలోని అన్ని డీసీసీబీల వ్యవహారాలపై ఈ కమిటీ విచారించనుంది. ఈ కమిటీలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సభ్యుడిగా నియమించారు. చిత్తూరు డీసీసీబీలో జరిగిన అవినీతి అక్రమాలపై సహకార చట్టం సెక్షన్ 51 కింద డీఆర్వో మోహన్ కుమార్ విచారణ పూర్తి చేశారు. ఈ నెల 15 తరువాత కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు నివేదికను అందించనున్నారు. దాన్ని కలెక్టర్ పరిశీలించిన అనంతరం ప్రభుత్వానికి పంపనున్నారు.

సత్యవేడులో ప్రజా దర్బార్

● మంత్రి లోకేశ్‌కు వినతుల వెల్లువ ● ముగిసిన రెండు రోజుల పర్యటన



ప్రజా దర్బార్‌కు వచ్చిన వికలాంగుడు వరుణ్‌ను పలకరిస్తున్న లోకేశ్

సత్యవేడు, మే 8 (ఆంధ్రజ్యోతి): సత్యవేడులో గురువారం ఉదయం మంత్రి లోకేశ్ 62వ ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధ పడుతున్న ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారులతో సెల్ఫీలు దిగారు. మంత్రికి వినతులు వెల్లువెత్తాయి. ప్రధానంగా బుచ్చినాయుడుకండిగ మండలం తలారివెట్టులో తాను 2021లో కొనుగోలు చేసిన 2.21 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని రైతు హరిప్రసాద్ నాయుడు కోరారు. పూర్తి అంగవైకల్యంతో బాధ పడుతున్న తన 20 ఏళ్ల కుమారుడికి ఆధార్ బయోమెట్రిక్ సమస్యవల్ల ఇప్పటి వరకు పింఛను మంజూరు కాలేదని సత్యవేడు మండలం మల్లవారిపాళెం ఈస్ట్ పంచాయతీకి చెందిన వెంకటేశులు ఆవేదన వ్యక్తంచేశారు. తన కుమారుడికి పింఛను ఇప్పించి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం తమ కుటుంబానికి మంజూరు చేసిన ఐదు సెంట్ల ఇంటి స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి నుంచి స్థలాన్ని రక్షించి, ఇంటి నిర్మాణానికి అనుమతివ్వాలని సత్యవేడు మండలం మదనంబేడుకు చెందిన సీహెచ్ శాంతి విన్నవించారు. తమ గ్రామంలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని నారాయణవనం మండలం ఎరికంబట్టుకు చెందిన దామోదరంరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగం ఇప్పిస్తామని సత్యవేడుకు చెందిన గోపాలకృష్ణ, ధనశేఖర్ తన వద్ద రూ.3 లక్షలు తీసుకుని మోసం చేశారని, న్యాయం చేయాలని టీపీకోటకు చెందిన వెంకటేశులు మంత్రిని కోరారు. సత్యవేడు పంచాయతీలో తాగునీటి కొరత తీర్చాలని, 50 పడకల ఆస్పత్రిని 100 పడకల స్థాయికి పెంచాలని, మట్టి మాఫియాను నియంత్రించాలని మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబు కోరారు. పట్టణంలో 20 ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న షాదీమహల్‌ను పూర్తి చేయాలని మసీదు కమిటీ సభ్యులు వినతి పత్రం అందించారు. తన అనుభవంలోని స్థలాన్ని వైసీపీ నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించి దారికి అడ్డంగా అక్రమ కట్టడం కట్టడంపై చర్యలు తీసుకోవాలని పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడుకు చెందిన జయంతి కోరారు.



చిన్నారితో సరదాగా..

శ్రేణుల్లో నూతనోత్సాహం

సత్యవేడులో బుధవారం సాయంత్రం కార్యకర్తల సమన్వయ సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేశ్.. గురువారం ఉదయం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం శ్రీసిటీకి వెళ్లి ఎల్‌జీ పరిశ్రమ భూమిపూజలో పాల్గొనడంతో ఆయన రెండు రోజుల పర్యటన ముగిసింది. ఆయన పర్యటన సత్యవేడు నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపింది. కొన్నేళ్లుగా సందిగ్ధావస్థలో ఉన్న కేడర్‌కు ఆయన ఇచ్చిన భరోసా ఉత్సాహం నింపిందనే చెప్పాలి. 'ఇక్కడి సమస్యలన్నీ తెలుసు. పరిష్కరిస్తాం. ఇద్దరు అబ్జర్వర్లను నియమించాం. సమస్యలుంటే వారితో చర్చించి, పరిష్కరించుకోండి. అవసరమైతే జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉన్నారు. అలకలు వీడి ఏకతాటిపై నిలబడండి. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కాలకేయులు (ప్రతిపక్షం) కాచుకుని ఉన్నారు. మళ్లీ రాష్ట్రం చీకట్లోకి వెళ్లాల్సి వస్తోంది జాగ్రత్త' అంటూ లోకేశ్ ఇచ్చిన పిలుపునకు కార్యకర్తల నుంచి విపరీత స్పందన వచ్చింది.

లోకేశ్ ప్రజా దర్బార్‌కు వైసీపీ నేతలు

రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ప్రజా దర్బార్‌కు సత్యవేడు మండల వైసీపీ నేతలు హాజరయ్యారు. ఆ పార్టీకి చెందిన ఎంపీపీ ప్రతిమ భర్త, వైసీపీ కన్వీనర్ సుశీల్‌కువార్ రెడ్డి, వైసీపీ మాజీ కన్వీనర్ నిరంజన్‌రెడ్డి, సత్యవేడు సర్పంచ్ మంజుల భర్త రమేష్ తదితరులు పాల్గొన్నారు. మండలంలో పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీకి కేటాయించడానికి జరుపుతున్న భూసేకరణను నిలిపివేయాలని లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. పారిశ్రామిక అభివృద్ధి ముఖ్యం కదా.. పరిశ్రమలు వస్తే మీ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది కదా అని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. అయినా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. వారు లోకేశ్‌తో సెల్ఫీ దిగారు.





విద్యార్థులకు మంత్రి అభినందనలు

అద్భుత ప్రతిభతో లండన్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సంపాదించిన నలుగురు విద్యార్థులను మంత్రి లోకేశ్ అభినందించారు. చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం మంగళపల్లె జడ్పీ హైస్కూల్‌కు చెందిన హేమ, పునీత్ సాయి, లహరి, రేవతి గణిత శాస్త్రంలోని 'పై' విలువను ఒక్కొక్కరు 1000 డెసిమిల్స్‌ను చూడకుండా చెప్పి లండన్ బుక్‌ఆఫ్ రికార్డ్‌లోకి ఎక్కారు. వీరిని తీసుకుని ఉపాధ్యాయులు ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్‌ను కలిశారు. విద్యార్థుల ప్రతిభను మెచ్చుకున్న మంత్రి.. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఫాసిజంపై పోరాడింది ఎర్రజెండానే

సీపీఎం రాష్ట్ర సభల ప్రారంభోత్సవంలో నేతలు

ముగిసిన పద్మావతి పరిణయోత్సవం

గరుడ వాహనంపై మలయప్ప అభయం

టీటీడీలో యూడీపీ సెల్

ప్రతిపాదనలకు మంత్రివర్గ ఆమోదం

వివరాలు 6వ పేజీలో



సాగరంలోకి వెళుతున్న అధికారుల బృందం

ప్రకృతి విపత్తులపై అప్రమత్తం


● మత్స్యకారుల అవగాహనకు మాక్‌డ్రిల్



బెటాలియన్ సిబ్బందితో సబ్‌కలెక్టర్, అధికారులు

కోట, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల సన్నద్ధతకు కోట మండలం గోవిందపల్లిపాళెం సముద్రతీరంలోవెంకటగిరి బెటాలియన్ ఆధ్వర్యంలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతా కుమారి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, తహశీల్దార్ జయజయరావుల సారథ్యంలో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సముద్రంలో పడిపోతే తక్షణం తీసుకోవాల్సిన జాగ్రత్తలను మాక్‌డ్రిల్‌లో ప్రదర్శించారు. సునామి వంటి విపత్తులను ఎలా ఎదుర్కొనాలో మత్స్యకారులకు పూసగుచ్చినట్టు వివరించారు. చిల్లకూరు, కోట, వాకాడు మండలాల్లోని 11 తీర గ్రామాల మత్స్యకారులు ఈ మాక్‌డ్రిల్ తిలకించి మెలకువలను తెలుసుకున్నారు. గోవిందపల్లిపాళెం ముఖద్వారం నుంచి సముద్రంలోకి వెళ్లి సుమారు రెండు గంటల పాటు మాక్‌డ్రిల్‌ను ప్రదర్శించారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాల ప్రయోగాలతో తీరంలో సందడి నెలకొంది.

సర్వదర్శనానికి 9 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 9 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.25 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,001

తలనీలాలు సమర్పించినవారు: 28,637

తిరుమలలో చైనీస్ ఫుడ్ అమ్మొద్దు

● సంప్రదాయ వంటకాలే ఉండాలి

● అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచనను అంగీకరించిన హోటళ్ల యజమానులు

తిరుమల, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి హానికరమైన చైనీస్ ఫుడ్‌ను విడిచిపెట్టి, సంప్రదాయ వంటకాలనే తిరుమలలో విక్రయించాలని హోటళ్ల నిర్వాహకులకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచించారు. గురువారం ఆయన హోటళ్ల యజమానులు, నిర్వాహకులతో సమావేశమయ్యారు. భక్తులకు అసౌకర్యం లేకుండా హోటళ్లలో పరిశుభ్రత పాటించాలని, నాణ్యమైన ఆహార పదార్థాలను భక్తిశ్రద్ధలతో అందించాలని చెప్పారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంప్రదాయ వస్త్రధారణతో సిబ్బంది ఉండాలని సూచించారు. త్వరలో ఐదు నుంచి 10 హోటళ్లలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఈ విధివిధానాలు అమలయ్యేలా నిర్వాహకులు సహకరించాలన్నారు. అనంతరం వెంకయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. చైనీస్ ఫుడ్‌ను పూర్తిగా నిలిపివేసేందుకు హోటళ్ల నిర్వాహకులు స్వచ్ఛందంగా అంగీకరించారని, అందుకు కొంత సమయం అడిగారన్నారు.

సరిహద్దుల్లో పెరిగిన నిఘా



తిరుపతిలో గురువారం రాత్రి తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 8(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో సరిహద్దుల వెంబడి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు తిరుమల క్షేత్రంలో అణువణువునా తనిఖీలు చేస్తున్నారు. ఆక్టోపస్, పారా మిలటరీ, ఏపీఎస్పీ, రిజర్వు, విజిలెన్సు సిబ్బందిని అప్రమత్తం చేశారు. సముద్ర తీర ప్రాంతంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. విమానాశ్రయంలో బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేస్తున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు, అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గత 10 రోజుల వ్యవధిలో దాదాపు 50 మందిని విచారించారు. ప్రధానంగా ఇతర రాష్ట్రాల నుంచి తిరుమల కొండకు వస్తున్న వాహనాలపై నిఘా పెంచారు. బస్టాండు, రైల్వే స్టేషన్లలో అప్రమత్తంగా ఉంటున్నారు. సీసీ కెమెరాల ద్వారా నిత్యం పర్యవేక్షణ జరుగుతున్నట్లు ఓ పోలీసు అధికారి చెప్పారు. డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఇక, ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాలతో గురువారం రాత్రి 10 నుంచి 11 గంటల వరకు తిరుపతిలోని డార్మెటరీలు, లాడ్జీల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా అనుమానితులుంటే ఈస్ట్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

టీటీడీలో యూడీపీ సెల్

● ఐటీ విభాగం డీజీఎం పోస్టు జీఎం స్థాయికి పెంపు

● ప్రతిపాదనలకు మంత్రివర్గ ఆమోదం

తిరుపతి, మే 8 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశం టీటీడీకి సంబంధించిన రెండు ప్రతిపాదనలను ఆమోదించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఇ-క్యాబినెట్‌లో టీటీడీ ప్రతిపాదనలు చర్చకు వచ్చాయి. అందులో టీటీడీలో అర్బన్ డిజైన్ అండ్ ప్లానింగ్ (యూడీపీ) సెల్ ఏర్పాటుకు దేవదాయ శాఖ చేసిన ప్రతిపాదన ఒకటి. తిరుపతి, తిరుమల సహా టీటీడీ అనుబంధ ఆలయాలు కలిగిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ విభాగం అవసరమని దేవదాయ శాఖ ప్రతిపాదనలో పేర్కొంది. దీనిపై చర్చించిన మంత్రివర్గం యూడీపీ సెల్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. దీనికి అవసరమైన ఎనిమిది పోస్టుల మంజూరుకూ అనుమతిచ్చింది. ఇక, టీటీడీ పాలన, వివిధ కార్యక్రమాల అమల్లో కీలకంగా మారిన ఐటీ విభాగంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టును జనరల్ మేనేజర్‌గా అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదననూ మంత్రివర్గం ఆమోదించింది. ఆ పోస్టు వేతన స్కేలును టీటీడీలో సూపరింటెండెంట్ ఇంజనీర్ వేతన స్కేలుతో (రూ. 1.01 లక్షల నుంచి 1.74 లక్షలు) సమానంగా ఖరారు చేయడానికీ ఆమోదం తెలిపింది.

పల్టీలు కొట్టిన కారు



● ప్రయాణికులు సురక్షితం

ఎర్రావారిపాలెం, మే 8(ఆంధ్రజ్యోతి): కారు నాలుగు పల్టీలు కొట్టింది. అందులోని ఆరుగురూ ప్రాణాలతో బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లెకు చెందిన ప్రవీణ్ కోయంబత్తూరులో పాదరక్షల కంపెనీలో పనిచేస్తున్నారు. గురువారం తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి తలకోన సిద్ధేశ్వర స్వామిని దర్శించుకుని సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. ఎర్రావారిపాలెం మబ్బుతోపు వద్ద అతివేగంతో వస్తున్న కారు అదుపు తప్పి నాలుగు పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో రెండు నెలల పసిబిడ్డతోపాటు అందరూ చిన్నపాటి గాయాలతో బయట పడ్డారు. ఏఎస్సై కోదండరాం అక్కడకు చేరుకుని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. అందరూ సురక్షితంగా బయటపడటంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

తిరుపతి(నేరవిభాగం), మే 8(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ప్రత్యేక న్యాయస్థానం గురువారం తీర్పునిచ్చింది. లైజన్ అధికారి పి.శ్రీనివాసులు కథనం మేరకు.. 2019లో అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన బుక్కే అమరేష్ నాయక్, మోతీనగర్‌కు చెందిన చెన్నూరు నిరంజన్ పీలేరు పోలీసు స్టేషన్ పరిధిలోని పచ్చారమాకుల పల్లి వద్ద ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. విచారణానంతరం ఎస్ఐ కృష్ణయ్య వీరిపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఆరేళ్లుగా కేసు కొనసాగింది. తిరుపతిలో కొత్తగా రాష్ట్ర ఎర్రచందనం కోర్టు ఏర్పాటైన క్రమంలో ఈ కేసును న్యాయమూర్తి నరసింహమూర్తి విచారించారు. ఇరువర్గాల వాదనలు విన్నాక, ఇద్దరు నిందితులకు గురువారం ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే రూ.6 లక్షల వంతుల జరిమానా విధించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణమనాయుడు, కోర్టు అనుసంధాన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, దర్యాప్తు అధికారులను అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అభినందించారు.



ముద్దాయిలతో పోలీసులు

ఎల్జీతో రెండు వేల మందికి పైగా ఉపాధి

● ఎల్జీ సిటీ నిర్మించాలని కొరియన్ సంస్థకు విజ్ఞప్తి ● శ్రీసిటీకి తిరుపతి ఎయిర్‌పోర్టుతో డైరెక్ట్ కనెక్టివిటీ ● ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్





ఎల్జీ ప్రతినిధులు, అధికారులు, ఎమ్మెల్యేలతో మంత్రి లోకేశ్ - ఎల్జీ సంస్థ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న లోకేశ్

తిరుపతి, మే 8 (ఆంధ్రజ్యోతి): 'శ్రీసిటీలో 5 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఎల్జీ పరిశ్రమ ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. 1500 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఎల్జీ పరిశ్రమ ముఖ్య విక్రేతల ద్వారా రూ.839 కోట్ల అదనపు పెట్టుబడులతో అనుబంధ ప్లాంట్లు కూడా వస్తాయి. వాటి ద్వారా మరో 690 మందికి ఉద్యోగావకాశాలు వస్తాయి' అని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శ్రీసిటీలో గురువారం మధ్యాహ్నం ఎల్జీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసిన సందర్భంగా మాట్లాడారు. అనుబంధ యూనిట్లతో పాటు ఎల్జీ సిటీ నిర్మించాలని ఆ సంస్థ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఏపీ ప్రభుత్వ సహాయ సహకారాల పట్ల నమ్మకంతో శ్రీసిటీలో పరిశ్రమ పెట్టేందుకు దక్షిణ కొరియాకు చెందిన ఎల్జీ సంస్థ ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఈ పరిశ్రమ ఎల్జీ సప్లై చెయిన్‌ను మరింత బలోపేతం చేస్తుందని, దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించే హైటెక్ యూనిట్‌గా అవతరిస్తుందన్నారు. ఎల్జీ సంస్థ, దాని భాగస్వామ్య సంస్థలు కలసి ఇక్కడ ఏఐ ఆధారిత తయారీ, స్మార్ట్ ఉత్పత్తి ప్రక్రియలు, ఎనర్జీ ఎఫిషియంట్ విధానాలు, అత్యాధునిక సాంకేతికతలను తీసుకొస్తున్నాయని లోకేశ్ చెప్పారు. ఇలాంటి ప్రాజెక్టులతో తమ ప్రభుత్వం స్మార్ట్ ఉద్యోగాలను సృష్టిస్తోందని, తద్వారా రాష్ట్ర భవిష్యత్తును నిర్మిస్తోందన్నారు. యువత తమ ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చడం కోసం పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఏపీలో పారిశ్రామిక ప్రగతికి శ్రీసిటీ చుక్కానిలా మారుతోందన్నారు. రాబోయే నాలుగేళ్లలో శ్రీసిటీ నుంచి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి డైరెక్ట్ కనెక్టివిటీ కల్పిస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా సంస్థ ఎండీ హంగ్ జు జియోన్, హోమ్ సొల్యూషన్స్ సీఈవో జేచియోల్ లియు, ఎకో సొల్యూషన్స్ సీఈవో జే సంగ్‌లీ, సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ జి.శ్రీనివాసులు, సత్యవేడు, శ్రీకాళహస్తి, నగరి, చంద్రగిరి, జీడీనెల్లూరు ఎమ్మెల్యేలు కోనేటి ఆదిమూలం, బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, పులివర్తి నానీ, థామస్, రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి కాటమనేని భాస్కర్, ఏపీఐఐసీ వైస్ చైర్మన్ అభిషిక్త కిషోర్, కాన్సులేట్ జనరల్ (ఏపీ, తెలంగాణ) చుక్కపల్లి సురేష్, కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఫాసిజంపై పోరాడింది ఎర్రజెండానే

● సీపీఎం రాష్ట్ర సభల ప్రారంభోత్సవంలో నేతలు



సభా వేదికపై సీపీఎం నేతల సంఘీభావం



సీపీఎం శ్రేణుల ర్యాలీ

తిరుపతి, మే8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే ఫాసిజంపై పోరాడింది ఎర్రజెండానేనని సీపీఎం నేతలు ఉద్ఘాటించారు. తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రం వేదికగా గురువారం నుంచి మూడు రోజుల పాటు సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 'ఫాసిజంపై ప్రజాసైన్యం విజయ స్ఫూర్తి' పేరిట కచ్చపి ఆడిటోరియంలో గురువారం సాయంత్రం సభ జరిగింది. సీపీఎం జాతీయ కార్యదర్శి ఎంఏ బేబి, పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఫాసిజంపై ప్రజాసైన్యం విజయ స్ఫూర్తికి చిహ్నంగా తొలుత నేతలు అభివాదం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న అభివృద్ధి మంత్రంపై శ్వేతపత్రం విడుదల చేయాలని శ్రీనివాసరావు డిమాండు చేశారు. కౌలు రైతులకు నష్ట పరిహారం లేదని, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఏనుగుల దాడి నుంచి రక్షణ లేదని, ప్రజారక్షకుడని చెప్పుకుంటున్న పవన్‌కల్యాణ్‌కు ఇవి పట్టవా అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో సీపీఎం ఒకటే రాజకీయ ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ ఉగ్రదాడిలో బాధితులు తమను కాపాడిన ముస్లింలను కొనియాడితే వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా దూషించడం సరైనది కాదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ తిరుపతిలో కూడా హిందువులను కానివారిని ఇబ్బందులు పెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, అంగేరి పుల్లయ్య, జనార్దన్, టి.సుబ్రమణ్యం, నాయకులు సాయిలక్ష్మి, జయచంద్ర, ఆర్.లక్ష్మి, వేణుగోపాల్, మాధవ్, హరినాథ్, వెంకటేష్ పాల్గొన్నారు. అంతకుముందు ఆర్టీసీ సెంట్రల్ బస్టాండు సమీపంలోని ఎంఎస్ సుబ్బలక్ష్మి విగ్రహం నుంచి కార్యకర్తలతో స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు.





ముగిసిన పద్మావతి పరిణయోత్సవం

● గరుడ వాహనంపై మలయప్ప అభయం

తిరుమల, మే8(ఆంధ్రజ్యోతి): పద్మావతి శ్రీనివాసుల పరిణయ మహోత్సవం గురువారం తిరుమలలో ముగిసింది. సాయంత్రం స్వామివారు గరుడ



వాహనంపై, దేవేరులు వేర్వేరు పలకిలపై ఊరేగింపుగా నారాయణగిరి ఉద్యానవనంలోని పద్మావతీ పరిణయోత్సవ మండపానికి చేరుకున్నారు. రెండు రోజుల్లాగే ఎదుర్కోలు, పూల చెండ్లాట, వస్త్ర సమర్పణ తదితర కార్యక్రమాలు ముగిశాక కొలువు నిర్వహించారు. వేద పారాయణం చేశారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు సంకీర్తనలను ఆలపించారు. అనంతరం స్వామి దేవేరులతో కలిసి ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేయడంతో మూడురోజుల వేడుకలు వైభవంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, డిప్యూటీఈవో లోకనాథం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

డీపీటీవోగా వెంకటరావు బాధ్యతల స్వీకరణ



తిరుపతి(ఆర్టీసీ), మే 8(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజారవాణాధికారిగా కె.వెంకటరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుక్ను ఆయన అక్కడి బస్టాండును, డిపోను సందర్శించారు. సాయంత్రం జిల్లా కార్యాలయానికి చేరుకోగా అధికారులు విశ్వనాథం, బాలాజీ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఈయూ, వైసీపీ యూనియన్ నాయకులు ఆయన్ను కలిసి సన్మానించారు.



గురువారం ఉదయం స్పైస్ జెట్ కౌంటర్ ముందు సిబ్బందిని నిలదీస్తున్న ప్రయాణికులు

సాంకేతిక కారణాలతో ఆగిన స్పైస్ జెట్

● ప్రయాణికుల నిరసన

● రీఫండ్ చేస్తామనడంతో మరో విమానంలో ప్రయాణం

రేణిగుంట, మే 8, (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో బుధవారం రాత్రి సాంకేతిక కారణాలతో స్పైస్ జెట్ విమానం ఆగిపోయింది.హైదరాబాదు నుంచి రాత్రి 8గంటలకు తిరుపతికి చేరుకుని 8.35కు హైదరాబాదుకు బయలుదేరాలి. తిరుపతికి చేరుకున్న ఈ విమానంలో హైదరాబాదు వెళ్లడానికి 70 మంది ప్రయాణికులు వేచి ఉన్నారు. స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక సమస్యను గుర్తించిన పైలెట్ యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు.ఉ సాంకేతిక సమస్య వల్ల విమానం మరమ్మతులు చేయాల్సి ఉందని సిబ్బంది ఆలస్యంగా చెప్పడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విమానాశ్రయంలో నిరసన తెలియజేశారు.అక్కడున్న అధికారులు వీరికి సర్ది చెప్పి టాక్సీలు కేటాయించి బస ఏర్పాటు చేశారు. తిరిగి గురువారం ఉదయం వీరంతా విమానాశ్రయం చేరుకోగా.. అప్పటికీ స్పైస్ జెట్‌కు మరమ్మతులు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో యాజమాన్యం టికెట్ల డబ్బును రీఫండ్ చేస్తామని చెప్పడంతో 10.30 గంటలకు ఇండిగో విమానంలో ప్రయాణికులు హైదరాబాదుకు వెళ్లారు.

పోలీసుల అదుపులో గాజుల చోరీ ముఠా

తిరుమల, మే8(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఓ వృద్ధురాలి చేతి గాజులను దోచుకుపోయిన ముఠాలో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాపట్ల జిల్లాలోని తుమ్మినేనికి చెందిన రవికుమార్ తన 70 ఏళ్ల తల్లి లక్ష్మి, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకుని బుధవారం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో రాంభగీచ బస్టాండ్ వద్ద బస్సు ఎక్కుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు లక్ష్మిని బస్సు మెట్లపై నెట్టి చేతికి ఉన్న 50 గ్రాముల బంగారు గాజులను లాక్కుని పారిపోయారు. రవికుమార్ ఫిర్యాదుతో పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించారు. పోలీసులు కొందరిని గుర్తించారు. తిరుమలలో వారి ఉనికి కోసం రివర్స్ మోడ్‌లో సీసీ కెమెరాల ఫుటేజిను పరిశీలించారు. ఉత్తరప్రదేశ్ నుంచి ఏడుగురు తిరుమల వచ్చి యాత్రికుల వసతి సముదాయంలో బస చేసినట్టు గుర్తించారు. అక్కడ వారిచ్చిన సెల్‌ఫోన్ నంబరు ఆధారంగా బృందంలోని నలుగురిని శ్రీకాళహస్తిలో బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన ముగ్గురు పరారయ్యారు. వీరి వద్ద బంగారు గాజులు ఉన్నట్టు పోలీసుల విచారణలో తేలింది. వారికోసం పోలీసులు గాలిస్తున్నారు. వీరు పాత నేరస్థులని తెలిసింది.

విచారణకు హాజరుకాలేదని ఏడాది జైలుశిక్ష

తిరుమల, మే8(ఆంధ్రజ్యోతి): 17 ఏళ్ల నాటి నకిలీ సర్టిఫికేట్ల కేసులో తిరుపతికి చెందిన ఓ వ్యక్తికి ఏడాది పాటు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. తిరుమల టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. 2008లో టీటీడీ బార్బర్ నోటిఫికేషన్‌కు సంబంధించి 10, 7 తరగతుల నకిలీ సర్టిఫికేట్లతో కొందరు ఉద్యోగం పొందారని టీటీడీ అధికారులు తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి మారుతినగర్‌కు చెందిన శివరామయ్య ఈ నిందితుల్లో ఒకడు. అయితే ఇతను విచారణ తర్వాత కోర్టుకు హాజరుకాకపోవడంతో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఈక్రమంలో తిరుమల వన్‌టౌన్ పోలీసులు ఈనెల 5న శివరామయ్యను అరెస్ట్ చేసి తిరుపతి స్పెషల్ జడ్జి ముందు హాజరుపరిచారు. దీంతో ముద్దాయికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. జరిమానా కట్టకుంటే ఏడాదిన్నరపాటు జైలుశిక్ష ఉంటుందని తీర్పునిచ్చారు.

● గతేడాది నవంబరులోని వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 వద్ద తెలంగాణకు చెందిన ఓ భక్తుడి నుంచి రూ.2,500 దొంగిలించిన కేసులో తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన శ్రీనివాస్‌కు తిరుపతి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.వంద జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

'మయూర' జయరాం చౌదరిపై అరెస్టు వారెంటు రీకాల్

తిరుపతి(నేరవిభాగం), మే 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని మయూర గ్రూప్ ఆఫ్ సంస్థల అధినేత మయూర జయరాం చౌదరిపై కోల్‌కత్తా హైకోర్టు జారీ చేసిన అరెస్టు వారెంటు రీకాల్ చేస్తూ తీర్పు చెప్పినట్లు తిరుపతి ఈస్ట్ పోలీసులు చెప్పారు. గతంలో కోల్‌కత్తాలోని ఓ కంపెనీకి అవసరమైన చక్కెర సరఫరా చేస్తామని చెప్పి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనికి సంబంధించి అడ్వాన్సుగా జయరాం చౌదరికి రూ.8 కోట్లు చెక్కు అందచేశారు. కొన్ని కారణాలతో చక్కెర సరఫరా చేయకపోవడంతో డబ్బు వెనక్కి ఇవ్వాలని వారు కోరారు. ఈ క్రమంలో రూ.5 కోట్లు ఇవ్వగా.. మిగిలిన మొత్తం కోసం వారు కోల్‌కత్తా హైకోర్టులో కేసు దాఖలు చేశారు. ఈ వాయిదాలకు హాజరు కాక పోవడంతో పాటు పిటీషనర్‌కు సరైన సమాధానం చెప్పక పోవడంతో ఇటీవల న్యాయస్థానం జయరాం చౌదరికి అరెస్టు వారెంటు జారీ చేసిన విషయం విదితమే. దీనిపై వారం కిందట జూమ్ కాన్ఫరెన్సు ద్వారా కోల్‌కత్తా హైకోర్టు జయరాం చౌదరిని, జిల్లా పోలీసు అధికారులను విచారించింది. ఆయనకు అనారోగ్య కారణాల రీత్యా చేసిన తప్పును ఒప్పుకొని కోర్టును క్షమాపణ కోరడంతో.. అరెస్టు చేయాలన్నన ఆదేశాలను న్యాయస్థానం ఉపసంహరించుకున్నట్లు ఈస్ట్ పోలీసులు చెప్పారు.

పోలేరమ్మకు రూ.4.2లక్షల ఆదాయం



హుండీ నగదును లెక్కిస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ హుండీ నగదును గురువారం ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో లెక్కించారు. జాతర నిర్వహించిన రెండ్రోజులకు గాను హుండీ ద్వారా రూ.4,23,017లు, జాతర నిర్వహణలో రూ.100 టిక్కెట్ల ద్వారా రూ.76,100లు, కానుకల ద్వారా నగదు రూపంలో భక్తులు రూ.2,373లు ఆదాయం వచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో రవికృష్ణ, జాతర కమిటీ చైర్మన్ సుబ్బారావు, సభ్యులు మణి, ధనుంజయ, అన్నమనేని సాయి, గోపి, శ్రీనివాసులు, శ్యామ్, పోట్లపూడి రాజేష్, నారాయణ, రవి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీల్లో రాణించాలి



క్రీడాకారులకు హాకీస్టిక్‌లు, బూట్లు అందజేస్తున్న పాశం సంధ్యారాణి

గూడూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడలో క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి పాశం సంధ్యారాణి అన్నారు. గురువారం స్థానిక ఏఆర్‌రెడ్డి ప్రభుత్వస్టేడియంలో శాప్ ఆధ్వర్యంలో వేసవి ఉచిత హాకీ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గూడూరు నుంచి ఎంతో మంది క్రీడాకారులు హాకీ క్రీడలో జాతీయస్థాయిలో రాణిస్తున్నారన్నారు. క్రీడల వలన ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ శిక్షణ కేంద్రంలో యువ క్రీడారులు మెలకువలను నేర్చుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం క్రీడాకారులకు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సహకారంతో హాకీస్టిక్‌లను, శాప్ సహకారంతో బూట్లను అందజేశారు. కార్యక్రమంలో పేటేటి చంద్రశీల్, కోచ్ దీపక్‌ఆకాష్, టీఆర్ మణి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సకు ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న పిచ్చయ్య నాయుడు, రామయ్య నాయుడు

చిల్లకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేడిమాల గ్రామానికి చెందిన అచ్చమ్మ అనే మహిళకు శస్త్రచికిత్స నిమిత్తం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిసాయంగా రూ.50వేలు నగదును ట్రస్ట్ అధ్యక్షుడు రాజనేని పిచ్చయ్య నాయుడు, కార్యదర్శి రామయ్య నాయుడు చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. రామయ్య నాయుడు మాట్లాడుతూ గ్రామానికి చెందిన అచ్చమ్మ గొంతుక్యాన్సర్‌తో బాధపడుతుందన్నారు. ఈ విషయాన్ని ట్రస్ట్ ఫౌండర్ శ్రీనివాసులు నాయుడి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమెకు శస్త్రచికిత్స చేయించుకునేందుకు నగదును అందజేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



నుజ్జునుజ్జయిన లారీ

పెళ్లకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట 71వ జాతీయ రహదారి మార్గంలోని కొత్తూరుకు సమీపంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు కాగా, మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. గూడూరు నుంచి నెల్లూరు వెళుతున్న లారీ కొత్తూరు సమీపంలో టైరు పంక్చరు కావడంతో రోడ్డు ప్రక్కన మార్జిన్‌లో నిలిపారు. ఈక్రమంలో పుంగనూరు నుంచి కలకత్తాకు టమోటో లోడుతో వెళుతున్న మరో లారీ పంక్చర్ అయిన లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కార్తికేయన్‌కు రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. అదే లారీలో ఉన్న మరో డ్రైవరు కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. తీవ్రగాయాలపాలైన కార్తికేయన్‌ను నాయుడుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం చెన్నై తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరుణించిన వరుణుడు

వెంకటగిరిటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం చల్లబడ్డా సాయంత్రానికి గాలివాన కురిసింది. రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో పట్టణంలో విద్యుత్ లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. వేరుశనగ, నిమ్మ, చామగడ్డ రైతులు వర్షం కురవడంతో ఆనందం వ్యక్తం చేశారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



మంగళసూత్రాన్ని చూపుతున్న వేదపండితులు

సూళ్లూరుపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట జీఎన్‌టీ రోడ్డులో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం గోవిందమ్మ, వీరబ్రహ్మేంద్ర స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. అనంతరం ఉత్సవమూర్తులను పుష్పాలతో అలంకరించి, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు చిట్టేటి పెరుమాల్, గోవిందమ్మ దంపతులు కల్యాణానికి వస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కల్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో చిట్టేటి రామదాస్, నూలేటి రమణయ్య, వాకచర్ల రమేష్, బట్టా సుబ్రమణ్యం, చెంగయ్య, మాధవాచారి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో శేఖర్‌నాయక్‌ను సత్కరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

తడ, మే 8 (ఆంధ్రజ్యోతి): తడ మండల ఎంపీడీవోగా శేఖర్‌నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా చిన్నమండ్యం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై తడ ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన ఈవోపీఆర్‌డీ విజయ్‌కుమార్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు గాబ్రియేల్, మస్తాన్ తదితరులు ఎంపీడీవోను శాలువాలతో సత్కరించారు.

అంకురార్పణతో ప్రారంభమైన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

చిల్లకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసివున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం అంకురార్పణ కార్యక్రమంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవస్వస్తివాచనము, సభాప్రార్థన, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, గోపూజ, యాగశాల ప్రవేశం, మృత్సంగ్రహణ, వాస్తుహోమము, కుంభస్థాపన, లఘుపూర్ణాహుతి వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ బ్రహ్మోత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయి.

చిన్నారులకు ఒడుగులు

నాయుడుపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని బాషా ఈఎం హైస్కూల్‌లో గురువారం ముస్లిం చిన్నారులకు ఒడుగుల కార్యక్రమం చేశారు. పాఠశాల గ్రూపు డైరెక్టర్ షేక్ రఫీ బాషా ఆధ్వర్యంలో ఉచితంగా ఒడుగులు నిర్వహించి చిన్నారులకు మందులు, పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మౌలానా అబ్దుల్ రెహమాన్, అబూబకర్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

అండర్‌బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో..?

- పోటుపాళెం జాతీయ రహదారి కూడలి వద్ద ప్రమాదకరంగా ప్రయాణాలు



జాతీయ రహదారిని దాటుతున్న వాహనాలు

గూడూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోటుపాళెం జాతీయ రహదారి కూడలి వద్ద అండర్‌బ్రిడ్జిని నిర్మించకపోవడంతో రోడ్డు దాటాలంటే వాహనదారులు అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. జాతీయ రహదారి నుంచి పట్టణంలోకి రావాలన్నా, పట్టణంలో నుంచి నెల్లూరు, నాయుడుపేట వెళ్లాలన్నా పోటుపాళెం జాతీయ రహదారి కూడలిపై నుంచే వెళ్లాల్సి ఉంటుంది. ఈ కూడలి వద్ద జాతీయ రహదారిపై విజయవాడ నుంచి చెన్నై, చెన్నై నుంచి విజయవాడ వెళ్లే వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. గూడూరు పరిసరాల ప్రాంతాలకు చెందిన ప్రజలు పట్టణానికి రావాలన్నా, పట్టణం నుంచి వివిధ ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలలో పనిచేసే ప్రజలు సమీప గ్రామాలకు వెళ్లాలన్నా ఈ కూడలి ద్వారానే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. దీంతో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఉన్న సమయంలో కూడలిని దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కూడలి దాటే సమయంలో జరిగిన ప్రమాదాల్లో పలువురు గాయాలపాలవడంతో పాటు, మృతిచెందిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ కూడలి వద్ద అండర్‌బ్రిడ్జిని ఏర్పాటు చేస్తే కూడలి దాటే వారు జాతీయ రహదారిపైకి వెళ్లకుండా అండర్‌బ్రిడ్జి ద్వారా రాకపోకలు సాగించి జాతీయ రహదారి సర్వీస్‌రోడ్డులోకి ఎటువంటి ప్రమాదాలు లేకుండా వెళ్లేందుకు ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు. ఈ సమస్యపై ఇటీవల పార్లమెంట్ సమావేశాలలో కూడా ప్రజాప్రతినిధులు చర్చించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో ప్రమాదాలను నివారించేందుకు రూ.48 కోట్లతో అండర్‌బ్రిడ్జిని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఈ ప్రకటన చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు ప్రారంభించలేదని, ఇకనైనా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో ప్రజల సౌకర్యార్థం అండర్‌బ్రిడ్జిని ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.



సత్యవేడు నియోజకవర్గంతోపాటు శ్రీసిటీ పర్యటనకు విచ్చేసిన మంత్రి నారా లోకేశ్‌ను గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ, బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి కార్యక్రమాల్లో వారు కూడా పాల్గొన్నారు. వీరితో పాటు టీడీపీ సీనియర్ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, తానంకి నానాజీ కూడా పాల్గొన్నారు. అదేవిధంగా సత్యవేడులో లోకేశ్ బసచేసిన ప్రజాదర్బార్ వేదిక వద్ద టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి కూడా లోకేశ్‌ను కలిశారు.

మాతమ్మకు ప్రత్యేక పూజలు



మాతమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకారంలో మాతమ్మ

చిల్లకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు అరుంధతీయవాడలోని మాతమ్మ అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. మాతమ్మ కొలుపులో భాగంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. మాతమ్మ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి తప్పెట్లు, తాళాలు, యువత నృత్యాల నడుమ అరుంధతీయవాడలో ఊరేగించారు. గొల్లలు, భక్తులు గంగపెట్టెను ఊరేగించారు. అనంతరం పోతురాజు ముగ్గు, పోతురాజు, అసురుల యుద్ధ కథ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అమ్మవారి దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని కొత్తపాళెం వాసి మృతి

వాకాడు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు కొత్తపాళెం రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగబాబు తెలిపిన వివరాల మేరకు.. కల్లూరు కొత్తపాళెం గ్రామానికి చెందిన బట్టా రమణయ్య (44) గురువారం రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి... నీటి గుంటలోపడి వ్యక్తి మృతి

వాకాడు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమూరు గ్రామానికి చెందిన తుపాకుల శీనయ్య (47) బుధవారం చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. శీనయ్య చేపలవేటకు వెళ్లి వస్తానని తిరుమూరు సమీపంలో ఉన్న గుంటలోకి వెళ్లాడు. రాత్రి అవుతున్నా శీనయ్య రాకపోవడంతో గుంట వద్దకెళ్లి గాలించామన్నారు. ఎంతకీ ఆచూకీ తెలియకపోవడంతో గుంటవద్దే వేచిచూడగా గురువారం మధ్యాహ్నం మృతదేహం ఆచూకీ లభించింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

గిరిజనులకు తాగునీటి కష్టాలు

పెళ్లకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులపాడు పంచాయతీ జూమానుగుంట గిరిజన కాలనీలో ప్రజలు తాగునీటి కోసం కష్టాలు పడుతున్నారు. రెండ్రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో తాగునీరు సరఫరా చేసే మోటారుకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాల్సి ఆశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో తాగునీరు లేక తీవ్ర కష్టాలు పడుతున్నామని గిరిజన మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదని మండి పడుతున్నారు. అదేవిధంగా చింతపూడి పంచాయతీ గంగరాజు కండ్రిగలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి ఎద్దడిని తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు.

- నిరుపయోగంగా చేతిపంపులు

జూమానుగుంట గిరిజన కాలనీలో మూడు తాగునీటి చేతిపంపులు(బోర్లు) ఉన్నాయి. ఈ మూడు చేతిపంపులు ఐదు నెలలుగా పనిచేయడంలేదు. తాగునీరందించే మోటార్లుకు విద్యుత్ సరఫరా లేనిసమయంలో చేతిపంపులు ప్రత్యామ్నాయంగా ఉండేవి. వేసవి ఎద్దడిని అధిగమించడంలో చేతిపంపులు కీలకమైనవి. వీటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

కరెంట్ కట్.. నీటికి కటకట

- రెండ్రోజులుగా తాగు, సాగునీటికి ఇక్కట్లు



ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పెళ్లకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లి, భీమవరం, అక్కగారిపేట, రావులపాడు, జూమానుగుంట ఎస్టీ కాలనీ, గంగరాజు కండ్రిగ దళిత కాలనీ తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులు, వర్షంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, స్తంభాలు నేలకొరిగాయి. రెండ్రోజులు అవుతున్నప్పటికీ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టలేదు. దీంతో ఈ గ్రామాల్లో ప్రజలు తాగునీటికి తల్లడిల్లిపోతున్నారు. మరోవైపు నాట్లకోసం సిద్ధంగా ఉన్న రైతులకు విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో సిద్ధం చేసుకున్న నారు ఎండిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా భీమవరం గ్రామానికి చెందిన స్వర్ణముఖి నది ఆనకట్ట ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో తాగు, సాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అనేక పర్యాయాలు విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలని ప్రయత్నం చేసినప్పటికీ వారు స్పందించడంలేదని అన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతామని ఆయన తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే ఈ గ్రామాలలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి ప్రజలకు తాగు, సాగు నీటి వసతి కల్పించాలని ఆయన కోరారు.

నేడు మాజీ సీఎం జనార్దనరెడ్డి వర్ధంతి

వెంకటగిరిటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి వర్ధంతి కార్యక్రమం వెంకటగిరిలోని ఆయన నివాసంలో శుక్రవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి గురువారం తెలిపారు. నియోజకవర్గంలోని నేదురుమల్లి అభిమానులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కోనలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



ఆలయంలో అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు

రాపూరు, మే 8 (ఆంధ్రజ్యోతి):పెంచలకోనలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఆలయంలోని అలంకార మండపంలో అర్చకులు, టీటీడీ వేదపండితులు ప్రత్యేక యాగశాలను ఏర్పాటు చేసి నిత్య హోమాలు చేశారు. అర్చకులు పుట్టమన్ను తీసుకొచ్చి అందులో నవధాన్యాలు కలిపి కలశస్థాపన చేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. ఎలాంటి ఆటంకాలు జరగకుండా దిగ్విజయంగా ఉత్సవాలు జరిగేందుకు ఈ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం కోన వీధుల్లో సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో 2వ రోజు శుక్రవారం ఉదయం స్వామివారికి తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం, సాయంత్రం శేష వాహనం జరగనుంది. ఆలయ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

- శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

కోనలోని లక్ష్మీ నృసింహస్వామి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి, ఆంజనేయస్వామి వార్లను గురువారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ జేపీ సుధ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఘనస్వాగతం పలికి, స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మండపంలో సుధ దంపతులను వేదపండితులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పొగాకు ఉత్పత్తుల వినియోగంతో క్యాన్సర్ ముప్పు



క్యాన్సర్ నిర్ధారణ కోసం పరీక్షలు చేస్తున్న వైద్యులు

డక్కిలి, మే 8 (ఆంధ్రజ్యోతి): పొగాకు, పాన్‌మసాలా, గుట్కా, ఖైరాన్ ఉత్పత్తులను వినియోగించే వారికి నోరు, ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పు పొంచి ఉందని స్థానిక ప్రభుత్వ వైద్యాధికారిణి డి.బిందుప్రియాంక హెచ్చరించారు. మండలంలోని శ్రీపురం, లింగసముద్రం గ్రామాల్లో తిరుపతి స్విమ్స్ ఆధర్యంలో గురువారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యఆరోగ్యశాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ శిబిరాలు నిర్వహించి, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు. ఈ శిబిరాల్లో బీపీ, షుగర్ పరీక్షలతో పాటు మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రాం, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణకు పాప్‌స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాలను ఈ నెల 12వ తేదీన మాధవాయపాళెం, తీర్థంపాడు, 15న మోపూరు, వెలికల్లు, 19న నాగవోలు, వెంబులూరు, 22న పలుగోడు గ్రామాల్లో నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి కె.నాగరాజ్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు చైతన్య, పద్మావతి, సర్పంచులు సుబ్బమ్మ, వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటాద్రి, ఏఎన్‌ఎంలు ప్రభ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవాసంఘం నూతన కార్యవర్గం ఎంపిక



ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవాసంఘం నూతన కార్యవర్గ సభ్యులు

గూడూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో గురువారం ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవాసంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా శ్రీకంటి రామమోహన్‌రావు, అధ్యక్షుడిగా బాలాజీ, కార్యదర్శిగా పవన్‌కుమార్, కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా శ్రావణ్‌కుమార్‌తోపాటు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడు రామమోహన్‌రావు మాట్లాడుతూ బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించడంతోపాటు పేద బ్రాహ్మణులకు సేవా కార్యక్రమాలను నిర్వహించేలా ఈ సేవాసంఘం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో బాలాజీ, కాశీవిశ్వేశ్వరశర్మ, విశ్వనాథ్, హరిప్రసాద్, నారాయణ, జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.